కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో..
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

నీలగిరి శంఖారావం

సమగ్ర సమాచార దర్శిని

తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :156 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | గురువారం 08-10-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

ఓటు,సీటు చోరీ పేటెంట్ కాంగ్రెసే...



కరీంనగర్,దేశంలో ఓటు, సీటు చోరీకి పేటెంట్ రైట్స్ కాంగ్రెస్ పార్టీకే ఉన్నా యని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజా సేవను పురస్కరించుకుని బీ జేపీ కరీంనగర్ జిల్లా పార్టీ ఆధ్వర్యంలో గీతాభవన్ చౌరస్తా నుంచి హౌజింగ్ బోర్డు కాలనీ పదవ చౌరస్తా వరకు సేవా జ్యోతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప సభకు భారీ ఎత్తున కార్యకర్తలు హాజరయ్యా రు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ సబిన్ వ ర్చువల్గా ప్రసగించి కార్యకర్తలను ఉత్తేజ పరిచారు.అనంతరం బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ దేశంలో మొట్టమొదటి ఓటు, సీటు చోరీకి పాల్పడింది కాంగ్రెస్ పార్టీయేనని ఆరోపించారు.దేశంలోని ప్రదేశ్ కా ంగ్రెస్ కమిటీలన్నీ సర్దార్ వల్లభభాయ్ పటేల్ను ప్రధాని అభ్యర్థిగా ప్రతిపాదించి నప్పటికీ,నెహ్రూను ప్రధానిని చేసిన ఘనత కాంగ్రెస్కే దక్కుతుందని వ్యాఖ్యానించారు.

ఓటు చోరీ అవసరం మోడీకి లేదు..

ప్రధాని నరేంద్ర మోదీకి ఓటు, సీటు చోరీ చేయాల్సిన అవసరం లేదన్నారు. మోదీకి కుటుంబం, బినామీ ఆస్తులు, వారసత్వ రాజకీయాలపై ఆసక్తి లేదని, దేశ ప్రజలే ఆయన కుటు ంబమని పేర్కొన్నారు. ప్రధాని పదవి నుంచి తప్పుకున్నా భుజాన సంచి వేసుకుని సామాన్యుడిలా ప్రజాసేవలో కొనసాగగల వ్యక్తి మోదీ అని కొనియాడారు.

ఈసీపై దాడి ప్రజాస్వామ్యాన్ని నీరుగార్చడమే..

ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధమైన సంస్థ అని, అది బీజేపీ జేబు సంస్థ కాదని బండి సంజయ్ అన్నారు. ఎన్నికల సంఘంపై నిరాధార ఆరోపణలు చేయడం, రాజ్యాంగ సంస్థలను బదనాం చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదకరమని పేర్కొన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్కుమార్ విషయంలో అభ్యంతరాలుంటే కోర్టును ఆశ్రయించి తేల్చుకో వాలని సూచించారు. రాహుల్ గాంధీ ఎన్నికల సంఘాన్ని ఎప్పుడైనా కలవచ్చని, అపాయింట్మెంట్ తీసుకుని సమస్యలను వివరించవచ్చన్నారు. వందల మందితో వెళ్లి ఎన్నికల సంఘంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తే అధికారులు అడ్డుకోక ఏం చేస్తారని ప్రశ్నించారు.

అనర్హుల ఓట్ల తొలగింపు తప్పా..?

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు అనర్హుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడమే ఎన్నికల సంఘం బాధ్యత అని బండి సంజయ్ అన్నారు. మరణించిన వారి పేర్లు ఓటర్ల జాబితాలో కొనసాగడాన్ని ప్రశ్నించిన ఆయన, అలాంటి పేర్లను తొలగిస్తే కూడా తప్పుపడుతున్నారని విమర్శించారు. దేశంలో పెద్ద సంఖ్యలో నకిలీ, డూప్లికేట్ ఓట్లు ఉన్నాయని గతంలో కాంగ్రెస్ నేతలే ఆరోపించారని పేర్కొంటూ, ఇప్పుడు వాటిని తొలగించే ప్రక్రియను ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు. ఓటర్ల జాబితా సవరణపై రాజకీయ లబ్ధి కోసం ఎన్నికల సంఘంపై బురదజల్లడం సరికాదన్నారు.

కాంగ్రెస్– బీఆర్ఎస్ చీకటి ఒప్పందం

మాజీ సీఎం కేసీఆర్ భూ వివాదాలపై కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు రాజకీయ డ్రామాగా బండి సంజయ్ అభివర్ణించారు. బీఆర్ఎస్ అవినీతిపై చర్యలు తీసుకునే దమ్ము కాంగ్రెస్కు లేదని ఆరోపించారు. అదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుపై పోరాడే దమ్ము బీఆర్ఎస్కు లేదని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందాలు ఉన్నాయని ఆరోపించారు. అలాగే బీజేపీ తనకు ఎన్నో పదవులు, అవకాశాలు కల్పించిందన్నారు. పదవుల కోసం పాకులాడే వ్యక్తిని కాదని, పార్టీ ఏ బాధ్యత అప్పగించినా కార్యకర్తగా శిరసావహిస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారి శాంతికుమార్, జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్రావు, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తీవ్రవాదానికి పాకిస్తాన్ మద్దతు.. జమ్ము కాశ్మీర్‌లో ఉగ్ర కార్యకలాపాలపై మండిపడ్డ భారత్



న్యూయార్క్: ఉగ్రవాదానికి మద్దతుగా నిలుస్తున్న పాకిస్తాన్‌పై భారత్ మరోసారి మండిపడింది. తీవ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాక్ చర్యల్ని ఐక్యరాజ్యసమితి వేదికగా భారత్ ఖండించింది. ఐక్యరాజ్యసమితి సాధారణ సర్వసభ్య సమావేశాలు ఇటీవల అమెరికా, న్యూయార్క్‌లో ప్రారంభమైన సంగతి తెలిసిందే. ప్రస్తుతం 81వ ఐరాస సాధారణ అసెంబ్లీ ఆరవ కమిటీ సమావేశం జరుగుతోంది. దీనికి ఇండియా కూడా హాజరైంది.ఇండియా తరఫున బీజేపీ ఎంపీ, జాతీయ ప్రధాన కార్యదర్శి విష్ణువ్ కుమార్ దేవ్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పాకిస్తాన్ వైఖరిని తీవ్రంగా తప్పుబట్టారు. సరిహద్దు తీవ్రవాదాన్ని భారత్ ఖండిస్తోందని తెలిపారు. ఉగ్రవాదాన్ని పాకిస్తాన్ పెంచి పోషిస్తోందన్నారు. జమ్ము కాశ్మీర్‌లో ఉగ్ర కార్యకలాపాలకు పాకిస్తానే కారణం అన్నారు. సరిహద్దు వెంట ఉగ్రవాద సంస్థల కోసం ప్రత్యేక క్యాంపుల్ని పాకిస్తాన్ ఏర్పాటు చేస్తోందని వివరించారు. జమ్ము కాశ్మీర్‌లో ఉగ్రవాదానికి పాకిస్తాన్ మద్దతు ఇస్తుందని చెప్పారు. సరిహద్దు ఉగ్రవాదం నుంచి తనను తాను రక్షించుకునే హక్కు ఇండియాకు ఉందన్నారు.ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ఉగ్రవాద దాడులకు జవాబుదారీ తనం కావాలని, అంతర్జాతీయంగా చట్టపరమైన విధానం ఉండాలని దేవ్ సూచించారు. తీవ్రవాదానికి మద్దతు, ఆర్థిక వనరుల సమీకరణ, సంస్థలు, కుట్రలు, చొరబాట్లు వంటి వన్నింటిపైనా చర్యలు తీసుకోవాలని సూచించారు. పహల్గాంలో జరిగిన దాడి సరిహద్దు తీవ్రవాదానికి నిదర్శనం అన్నారు. ఈ దాడిలో 26 మంది మరణించారని తెలిపారు. ఈ ఘటనకు పాకిస్తాన్‌కు చెందిన లష్కర్ ఏ తైబా సంస్థ బాధ్యత వహించిన సంగతి తెలిసిందే. సరిహద్దు ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న దేశం పాకిస్తాన్ అని ఐరాస సభలో మరోసారి ఇండియా చాటిచెప్పింది.

తెలంగాణ ఉద్యోగులకు గుడ్‌న్యూస్.. రెండు డీఏలు మంజూరు



హైదరాబాద్, అక్టోబర్ 7: తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు సర్కార్ శుభవార్త చెప్పింది ప్రభుత్వ ఉద్యోగులకు రెండు డీఏలు మంజూరు చేస్తూ రాష్ట్ర సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. జనవరి 2024 నుంచి డీఏ 33.67 శాతం నుంచి 37.31 శాతానికి పెంచింది. అలాగే జూలై 2024 నుంచి డీఏ 37.31 శాతం నుంచి 40.04 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అంతేకాకుండా 2015 పే స్కేల్ ఉద్యోగులకు కూడా డీఏ 73.344 శాతం నుంచి 78.06 శాతానికి పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జూలై 2024 నుంచి 78.06 శాతం నుంచి 81.728 శాతానికి, 2020 పే స్కేల్ ఉద్యోగులకు డీఏ 37.31 శాతం నుంచి 40.04 శాతానికి పెంచింది.యూజీసీ, ఏఐసీటీఈ పే స్కేళ్ల ఉద్యోగులకు కూడా డీఏ పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2016 పే స్కేల్ ఉద్యోగులకు డీఏ 46 శాతం నుంచి 50 శాతానికి, జూలై 2024 నుంచి డీఏ 50 శాతం నుంచి 53 శాతానికి పెంచింది. అలాగే 2006 పే స్కేల్ ఉద్యోగులకు డీఏ 230 శాతం నుంచి 239 శాతానికి, జూలై 2024 నుంచి 239 శాతం నుంచి 246 శాతానికి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది.పెంచిన డీఏ అక్టోబర్ 2026 జీతంతో కలిపి నవంబర్ 1న చెల్లించనున్నట్లు ఉత్తర్వులో పేర్కొంది. జనవరి 2024 నుంచి సెప్టెంబర్ 2026 వరకు ఉన్న డీఏ బకాయిలను 33 వాయిదాల్లో ప్రభుత్వం చెల్లించనుంది. అదే విధంగా జూలై 2024 నుంచి సెప్టెంబర్ 2026 వరకు ఉన్న డీఏ బకాయిలను 27 వాయిదాల్లో చెల్లింపులు జరుపనుంది. డీఏ బకాయిలను ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది.

దేశానికి మరింత సేవ చేస్తా : మోదీ



న్యూఢిల్లీ,గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి నేటి వరకు ప్రభుత్వం అధినేతగా 25 సంవత్సరాల సుదీర్ఘ ప్రజా సేవను దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. 2001 అక్టోబర్ 7న గుజరాత్ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన వేళ, భవిష్యత్తులో దేశానికి ఇంత సుదీర్ఘకాలం సేవ చేసే అవకాశం లభిస్తుందని తాను ఎన్నడూ ఊహించలేదని సేవాజ్యోతి సభలో ఆయన పేర్కొన్నారు. భారతదేశ ప్రజాస్వామ్యం, రాజ్యాంగం మరియు నమ్మకంతో గెలిపించిన కోట్లాది మంది ప్రజల ఆశీర్వాదాల వల్లే ఇది సాధ్యమైందని చెప్పారు. ప్రజలు తమ సేవకుడిగా తనపై ఉంచిన విశ్వసనీయతకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని, భారత్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించడమే తన జీవిత ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు.

వికసిత భారత్ వైపు అడుగులు: నిరంతర విద్యార్థిగా ప్రధాని

ప్రతిజ్ఞసమాజానికి మరియు దేశానికి మరింత శక్తివంతంగా సేవ చేస్తానని ప్రతిజ్ఞ చేసిన ప్రధాని మోదీ, మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతిరోజూ కొత్త విషయాలను నేర్చుకోవడానికి ఇష్టపడే నిత్య విద్యార్థిని అని వ్యాఖ్యానించారు. క్షేత్రస్థాయి అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుంటూ, దేశంలోని ప్రతి వర్గానికి సంక్షేమ ఫలాలను అందించడమే లక్ష్యంగా పరిపాలిస్తున్నానని వెల్లడించారు. విజన్ 2047 లక్ష్యంలో భాగంగా 'వికసిత భారత్' స్వప్నాన్ని సాకారం చేసేందుకు రాబోయే రోజుల్లో మరింత పట్టుదలతో శ్రమిస్తానని స్పష్టం చేశారు. 25 ఏళ్ల ఈ సుదీర్ఘ ప్రయాణంలో సంపూర్ణ మద్దతుగా నిలిచిన ప్రతి భారతీయ పౌరునికి ధన్యవాదాలు తెలియజేస్తూ, రాబోయే కాలంలో కూడా దేశాభివృద్ధే ఊపిరిగా సేవా దృక్పథంతో ముందుకు సాగుతానని పునరుద్ఘాటించారు.

రోడ్ల భద్రతపై మంత్రి కోమటిరెడ్డి కీలక వ్యాఖ్యలు.. ఆ స్వీడన్ మోడల్ కావాల్సిందే!



హైదరాబాద్, రాష్ట్రంలో సురక్షిత రహదారుల నిర్మాణమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. గుజరాత్ రాష్ట్రం నర్మద జిల్లాలోని ఎక్తానగర్‌లో స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ప్రాంగణంలో జరుగుతున్న చింతన్ శివిర్ రెండో రోజు కార్యక్రమంలో రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి 'సురక్షిత రహదారుల రూపకల్పన–ప్రమాణాల నుంచి అమలు వరకు' అనే అంశంపై జరిగిన ప్రత్యేక సెషన్‌కు అధ్యక్షత వహించారు.

మంత్రి మాట్లాడుతూ..

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రోడ్ల నిర్మాణానికి ప్రమాణాలు రూపొందించడమే కాదని, క్షేత్రస్థాయిలో సురక్షిత రహదారుల నిర్మాణమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. 2030 నాటికి రోడ్డు ప్రమాద మరణాలను 50 శాతం తగ్గించేందుకు కేంద్ర, రాష్?ట్ర ప్రభుత్వాల సమష్టి కృషి అవసరమన్నారు. బ్లాక్ స్పాట్లను గుర్తించడం కాదని, శాశ్వత ఇంజినీరింగ్ పరిష్కారాలు చూపాలని సూచించారు. డిజైన్ నుంచి నిర్మాణం, నిర్వహణ వరకు ప్రతి దశలోనూ భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. భూసేకరణ, రైట్ ఆఫ్ వే రహదారి భద్రతలో కీలక అంశాలని వెల్లడించారు. హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి–65పై నిత్యం జరుగుతున్న ప్రమాదాలు ఆందోళనకరమని, 6ం2 లేన్ విస్తరణ పనులు వెంటనే ప్రారంభించాలని కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు.

రహదారి భద్రతలో 'విజన్ జీరో' విధానం

రోడ్డు భద్రత ఆడిట్లు నిరంతర ప్రక్రియగా కొనసాగాలన్నారు. అంతర్జాతీయ అనుభవాల నుంచి నేర్చుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఇటీవల తాను పలు దేశాల్లో పర్యటించి రహదారి భద్రతకు సంబంధించిన అనేక ఉత్తమ విధానాలను పరిశీలించానని మంత్రి తెలిపారు. ప్రపంచంలోని అనేక దేశాలు రోడ్డు భద్రతను కేవలం ఇంజినీరింగ్ అంశంగా కాకుండా ప్రత్యేక వృత్తిపరమైన విభాగంగా పరిగణిస్తున్నాయని చెప్పారు. స్వీడన్ అమలుచేస్తున్న 'విజన్ జీరో' విధానం నుంచి ఎంతో నేర్చుకోవచ్చని అన్నారు. రహదారిపై ఒక్క మరణం లేదా తీవ్ర

హైకమాండ్‌తో కీలక భేటీలు!



హైదరాబాద్, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి మరోసారి ఢిల్లీ బాట పట్టారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన చేపడుతున్న 79వ ఢిల్లీ పర్యటన ఇది. సెప్టెంబర్ 28న ప్రారంభమైన రెండు రోజుల ఢిల్లీ పర్యటనతో ఆయన హస్తిన పర్యటనల సంఖ్య 78కి చేరుకుంది.ప్రస్తుత ఢిల్లీ రాజకీయ పరిణామాల నేపథ్యంలో సీఎం పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. ఎన్నికల వ్యవస్థలో అవకతవకలు జరిగాయంటూ కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు చేపట్టిన నిరసనల సందర్భంగా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా పలువురు నేతలను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటనపై రేవంత్‌రెడ్డి ఇప్పటికే తీవ్రంగా స్పందించారు. ఈ పరిణామాల మధ్య ఆయన ఢిల్లీకి వెళ్లడం రాజకీయంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది.

కాంగ్రెస్ పెద్దలతో భేటీలు

శంషాబాద్ విమానాశ్రయం నుంచి సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ బయలుదేరారు. ఆయన వెంట వి. హనుమంతరావు, రోహిన్‌రెడ్డి ఉన్నారు. ఢిల్లీ చేరుకున్న అనంతరం కాంగ్రెస్ అగ్రనేతలు, ఏఐసీసీ ముఖ్యులతో సీఎం భేటీ అయ్యే అవకాశం ఉంది. ప్రస్తుత రాజకీయ పరిణామాలు, పార్టీ కార్యక్రమాలు, తెలంగాణకు సంబంధించిన పలు అంశాలపై చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

రాహుల్ అరెస్టుపై ఇప్పటికే స్పందన

రాహుల్ గాంధీ సహా కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలను అదుపులోకి తీసుకోవడాన్ని రేవంత్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యం, ఓటు హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ చేస్తున్న పోరాటాన్ని అరెస్టులతో అడ్డుకోలేరని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాలపై కాంగ్రెస్ ఆందోళన కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

కేంద్ర మంత్రులతోనూ సమావేశాలు?

ఢిల్లీ పర్యటనలో కేంద్ర మంత్రులను కూడా సీఎం రేవంత్‌రెడ్డి కలిసే అవకాశం ఉంది. రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ అంశాలు, కేంద్రం నుంచి రావాల్సిన అనుమతులు, నిధులు, వివిధ అభివృద్ధి ప్రాజెక్టులపై వారితో చర్చించే అవకాశముున్నట్లు తెలుస్తోంది. గత ఢిల్లీ పర్యటనల్లోనూ రేవంత్‌రెడ్డి పలువురు కేంద్ర మంత్రులను కలిసి తెలంగాణకు సంబంధించిన అంశాలను ప్రస్తావించిన విషయం తెలిసిందే.

రాజకీయంగానూ ఆసక్తి

ఓవైపు కాంగ్రెస్ అగ్రనేతల అరెస్టుల నేపథ్యంలో ఢిల్లీలో రాజకీయ వేడి కొనసాగుతుండగా.. మరోవైపు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి హస్తిన పర్యటనకు వెళ్లడం ప్రాధాన్యం సంతరించుకుంది. హైకమాండ్‌తో జరిగే భేటీల్లో తాజా పరిణామాలపై చర్చతో పాటు పార్టీ పరంగా తీసుకోవాల్సిన తదుపరి కార్యాచరణపై కూడా సమాలోచనలు జరిగే అవకాశం ఉంది.

'నీ అంతు చూస్తా' అని అనలేదు.. పాడి కౌశిక్ రెడ్డి వివరణ

హైదరాబాద్: కడియం శ్రీహరిని బెదిరించారన్న ఆరోపణలపై ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఎథిక్స్ కమిటీకి వివరణ ఇచ్చారు. తనపై వచ్చిన ఆరోపణలు నిరాధారమని ఆయన పేర్కొన్నారు. కడియం శ్రీహరిని ఉద్దేశించి 'నీ అంతు చూస్తా' అని తాను ఎప్పుడూ అనలేదని స్పష్టం చేశారు. అలాగే గన్ గురిపెట్టినట్లు తాను సంజ్ఞలు చేశానన్న ఆరోపణలు కూడా అవాస్తవమని తెలిపారు. అసెంబ్లీలో జరిగిన ఘటనకు సంబంధించిన వీడియోను తప్పుగా అర్థం చేసుకుని తనపై అభియోగాలు మోపారని కౌశిక్ రెడ్డి వివరణ ఇచ్చారు. ఈ క్రమంలో తన హావభావాలను సందర్భం నుంచి వేరు చేసి చూపించారని పేర్కొన్నారు. ఈ ఆరోపణలు కాంగ్రెస్ సభ్యులే చేశారని తెలిపారు. సభలో జరిగిన వాగ్వాదం, పరస్పర ఆరోపణలు, నినాదాల మధ్యే ఈ ఘటన చోటుచేసుకుందని వివరించా రు.అసెంబ్లీ ఘటనకు సంబంధించి ఎథిక్స్ కమిటీకి అందిం చిన వీడియో క్లిప్పింగ్ అసంపూర్ణంగా ఉందని కౌశిక్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. మొత్తం ఘటనకు సంబంధించిన పూర్తి వీడియోను పరిశీలించాలని కోరారు. ఆఫ్–రికార్డ్ వీడియో ఫుటేజ్‌ను కూడా పరిశీలించాలని కమిటీకి విజ్ఞప్తి చేశారు.



సంపాదకీయం

గురువారం 08-10-2026

సుస్థిర వృద్ధికి సంస్కరణలే ఇంధనం

ప్రపంచంలోనే శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్ నేడు తన ప్రత్యేకతను చాటుకుంటోంది. డిజిటలీకరణకు తోడు మార్కెట్ సామర్థ్యాన్ని పెంచడం, పోటీతత్వాన్ని బలోపేతం చేయడం, ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించడం వంటి నిర్మాణాత్మక చర్యలు ఇందుకు దోహదవడ్డాయి. అధిక వృద్ధిని భవిష్యత్తులోనూ కొనసాగించడానికి ఆవిష్కరణలు, ఉత్పాదకత, కార్మిక మార్కెట్, న్యాయ పరిష్కారాలు, వస్తుసేవల పన్ను(జీఎస్టీ) వంటి రంగాల్లో రెండో తరం సంస్కరణలు అవసరం. ఇందుకోసం, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జీఎస్టీ మండలి ఎల్లుండి సమావేశం కానుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆర్థిక వ్యవస్థను సమర్థంగా, సమ్మిళిత అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు ఇండియా పలు నిర్మాణాత్మక చర్యలను చేపడుతూ వస్తోంది. ముఖ్యంగా జీఎస్టీ పేరుతో దేశమంతటా ఒకే పన్ను వ్యవస్థను తీసుకురావడం మార్కెట్ ఏకీకరణకు దోహదపడింది. ఆధార్, యూపీఐ, డిజిలాకర్ వంటి సదుపాయాల ద్వారా డిజిటల్ ఆర్థిక వ్యవస్థ విస్తరించింది. సేవల పంపిణీ మరింత వేగంగా, పారదర్శకంగా మారింది. కార్పొరేట్ పన్ను తగ్గింపు, ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకాలు దేశవిదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలో కీలకమయ్యాయి. జాతీయ మౌలిక వసతుల పైప్‌లైన్, పీఎం గతిశక్తి, జాతీయ లాజిస్టిక్స్ విధానం వంటి కార్యక్రమాలు సరకు రవాణా, సరఫరా గొలుసుల సామర్థ్యాన్ని గణనీయంగా పెంచాయి. అదే సమయంలో కస్టమ్స్ సంస్కరణలు, సులభతర వాణిజ్య విధానాలు భారతదేశాన్ని ప్రపంచ పెట్టుబడులకు అనుకూలమైన గమ్యస్థానంగా తీర్చిదిద్దాయి. జన్‌ధన్ యోజన, ప్రత్యక్ష నగదు బదిలీ, డిజిటల్ చెల్లింపుల ద్వారా కోట్ల మంది అధికారిక ఆర్థిక వ్యవస్థ పరిధిలోకి వచ్చారు.

మదుపరుల్లో పెరిగిన నమ్మకం

జీఎస్టీ కారణంగా ఏకీకృత జాతీయ మార్కెట్ ఏర్పడి, అంతర్రాష్ట్ర వాణిజ్యం సులభతరమైంది. దివాళా పరిష్కార చట్టం (ఐబీసీ)తో వ్యాపార సంస్థల ఆర్థిక క్రమశిక్షణ బలోపేతం కావడంతో పాటు ఆస్తుల పునర్వినియోగమూ సాధ్యమైంది. మరోవైపు బ్యాంకింగ్ వ్యవస్థలో క్రమశిక్షణ పెరిగి, దేశ ఆర్థిక స్థిరత్వం మరింతగా మెరుగుపడింది. వీటికి... వేగవంతమైన అనుమతులు, మౌలిక వసతుల విస్తరణ, రవాణా వ్యయాల తగ్గుదల, ఉత్పత్తి సామర్థ్యం పెంపు వంటివి కూడా తోడయ్యాయి. దాంతో మదుపరుల్లో నమ్మకం బలపడి, పెట్టుబడుల ప్రవాహం ఊపందుకుంది. కానీ, ఇప్పటికీ అనేక సవాళ్లు అలాగే కొనసాగుతున్నాయి. శ్రామికశక్తిలో మహిళల భాగస్వామ్యం తక్కువగానే ఉంది. అసంఘటిత రంగం పెద్దదిగా ఉండటం, నైపుణ్యాల కొరత, వాణిజ్య వివాదాల పరిష్కారంలో జాప్యం, భూసేకరణ సమస్యలు, అధిక లాజిస్టిక్స్ వ్యయాలు, వ్యవసాయ మార్కెట్లలో విభజన, రాష్ట్రాలమధ్య నియంత్రణల భిన్నత్వం, ఆర్‌అండ్‌డీ రంగానికి పెట్టుబడుల కొరత వంటి సవాళ్లు తప్పడంలేదు. తదుపరి సంస్కరణలతో వీటిని పరిష్కరించగల వీలుంది.దేశార్థిక వ్యవస్థ వేగం పుంజుకున్నప్పటికీ, 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాధించడానికి అధిక వృద్ధిరేటు ఒక్కటే సరిపోదు. మార్కెట్లు మరింత సమర్థంగా పనిచేయాలి, పెట్టుబడులు పెరగాలి, ఉత్పాదకత మెరుగుపడాలి. పైగా, వ్యాపార నిర్వహణ వ్యయం బాగా తగ్గాలి. ఇందుకోసం గడిచిన దశాబ్దంలో చేపట్టిన నిర్మాణాత్మక సంస్కరణలను మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరముంది. ఈ నేపథ్యంలో జీఎస్టీలో చేపట్టదలచిన 'తదుపరి తరం సంస్కరణలు' అత్యంత కీలకంగా మారాయి. 2017లో జీఎస్టీ రాకతో రాష్ట్రాల వారీగా ఉన్న అనేక పరోక్ష పన్నుల స్థానంలో దేశవ్యాప్తంగా ఒకే సమగ్ర పన్ను వ్యవస్థ ఏర్పడింది. అయితే, రెండోతరం సంస్కరణల ద్వారా దీన్ని మరింత సరళంగా, పారదర్శకంగా, పన్ను చెల్లింపుదారులకు అనుకూలంగా తీర్చిదిద్దాల్సి ఉంది. ఇందులో భాగంగా పన్ను రేట్ల హేతుబ ద్ధీకరణ, పన్ను అమలు సరళీకరణపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. ఇప్పటికే కొత్త రేట్లు అమలులోకి రావడం ఈ దిశలో ముఖ్యమైన అడుగు. పన్ను వ్యవస్థ ఎంత సరళంగా ఉంటే వ్యాపార సంస్థలకు అంతగా ఖర్చులు తగ్గుతాయి. దానివల్ల చిన్న, మధ్యతరహా సంస్థలు ఎక్కువగా లాభపడతాయి. పన్ను రేట్ల సరళీకరణ వల్ల వినియోగదారులకూ ఉపశమనం కలుగుతుంది, వ్యాపారాల విస్తరణకూ అవకాశం ఏర్పడుతుంది.

కీలక ముందడుగు...

జీఎస్టీ వ్యవస్థకు సంబంధించిన ఇటీవలి గణాంకాలు దాని విజయగాథను తెలియజేస్తున్నాయి. '2026 ఏప్రిల్-సెప్టెంబర్ మధ్య స్థూల జీఎస్టీ వసూళ్లు రూ.12.46 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. గత ఏడాదితో పోలిస్తే ఇది 11.6శాతం అధికం. జూన్-సెప్టెంబర్ మధ్య రిఫండ్లను మినహాయించిన తర్వాత కూడా నికర వసూళ్లు 10.4శాతం పెరిగాయి' అని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. జీఎస్టీ రేట్ల మార్పుల తర్వాత బీ2సీ (వ్యాపారి నుంచి వినియోగదారులకు) అమ్మకాలు ఏకంగా 26.7శాతం పెరగడం వినియోగ డిమాండ్ బలపడటాన్ని సూచిస్తోంది. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ సకాలంలో అందడమన్నది చిన్న వ్యాపారాల వర్కింగ్ క్యాపిటల్‌కు కీలకం. అలాగే ఏప్రిల్-సెప్టెంబర్ కాలంలో రూ.1.8 లక్షల కోట్ల రిఫండ్లు చెల్లించడం గమనార్హం. ఆగస్టు నాటికి జీఎస్టీ రిజిస్ట్రేషన్లు 1.7 కోట్లకు చేరాయి. అయితే రిఫండ్లు, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్(ఐటీసీ), పన్ను వివాదాల పరిష్కారం మరింత వేగవంతం కావాలి. రెండో తరం జీఎస్టీ సంస్కరణలు కేవలం పన్ను సంస్కరణలు మాత్రమే కావు; సరళమైన పన్ను వ్యవస్థ ద్వారా పెట్టుబడి, వినియోగం, ఉపాధి, ఆర్థిక వృద్ధిని వేగవంతం చేసే కీలక ముందడుగులు! జీఎస్టీ వ్యవస్థ మరింత స్పష్టంగా, స్థిరంగా, పన్ను చెల్లింపుదారులకు అనుకూలంగా మారితే- సంస్థలు మరిన్ని పెట్టుబడులతో విస్తరించే అవకాశం ఉంటుంది. తద్వారా ఆర్థిక వృద్ధి, ఉపాధి, వినియోగం, పెట్టుబడులు, ప్రభుత్వ ఆదాయాలు పరస్పరం బలపడతాయి. అందుకే, భారత్ తన ప్రస్తుత ఆర్థిక వృద్ధిని భవిష్యత్తులోనూ కొనసాగించడానికి జీఎస్టీలో రెండో తరం సంస్కరణలు అత్యవసరమవుతున్నాయి.

ఫిరాయింపుల నిరోధం.. ఇంకా అసంపూర్తే!



హైదరాబాద్,పార్టీ మారడం రాజకీయాల్లో కొత్తేమీ కాదు.. కానీ ప్రజల తీర్పుతో ఎన్నికైన ప్రజాప్రతినిధి పార్టీ మారినప్పుడు ఆ తీర్పు విలువ ఏమవుతుందన్న ప్రశ్న మాత్రం ఎప్పటికీ కొత్తగానే ఉంటుంది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హతపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు మరోసారి ఫిరాయింపుల చట్టం, స్పీకర్ అధికారాలు, ఓటరు తీర్పు పరిరక్షణపై చర్చను ముందుకు తెచ్చింది. రాజకీయ పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా స్పందిస్తున్న పరిస్థితుల్లో.. ఫిరాయింపుల నిరోధానికి ఉన్న చట్టం నిజంగా తన లక్ష్యాన్ని నెరవేరుస్తోందా?గతంలో జాతీయ, ప్రాంతీయ పార్టీలలో అనేకం వివిధ సందర్భాల్లో పార్టీ మార్పుల వల్ల ప్రయోజనం పొందాయి. దానం నాగేందర్ విషయానికొస్తే, ఆయన 2023లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎన్నికయ్యారు. ఎమ్మెల్యేగా కొనసాగుతూనే 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. దీనిపై బీఆర్ఎస్ అనర్హత పిటిషన్ వేయగా స్పీకర్ తిరస్కరించారు. హైకోర్టు ఆ నిర్ణయాన్ని రద్దు చేసి ఆయన 2024 ఏప్రిల్ 23 నుంచే అనర్హుడని ప్రకటించింది. ఆ తీర్పును నాగేందర్ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. సుప్రీంకోర్టు హైకోర్టు తీర్పునే సమర్థించింది.

పార్టీ ఫిరాయింపులు ఇప్పటి కథ కాదు..

1967లో హర్యానా ఎమ్మెల్యే గయాలాల్ వరుసగా పార్టీలు మార్చడంతో "ఆయా రామ్, గయా రామ్" అన్న పదబంధం ప్రాచుర్యంలోకి వచ్చింది. 1967--71 మధ్య పార్లమెంటులో 142, రాష్ట్ర శాసనసభల్లో 1,969 ఫిరాయింపులు నమోదయ్యాయి.. 32 ప్రభుత్వాలు కూలిపోయాయి. అందుకే 1985లో 52వ రాజ్యాంగ సవరణ ద్వారా పదో షెడ్యూల్‌ను చేర్చారు. పార్టీ టికెట్‌పై ఎన్నికైన సభ్యుడు స్వచ్ఛందంగా పార్టీ సభ్యత్వాన్ని వదిలినా, పార్టీ ఆదేశానికి విరుద్ధంగా సభలో ఓటు వేసినా లేదా ఓటింగ్‌కు దూరంగా ఉన్నా అనర్హతకు గురయ్యే నిబంధనలు అందులో ఉన్నాయి. అనర్హతపై నిర్ణయం చెప్పే అధికారం స్పీకర్ లేదా చైర్మన్‌కు అప్పగించారు. అయితే, మొదటి చట్టంలో ఒక రాజకీయ పార్టీ శాసనసభాపక్షంలో చీలిక ఏర్పడి, కనీసం మూడింట ఒక వంతు మంది సభ్యులు ప్రత్యేక గ్రూపుగా ఏర్పడితే అది "స్ప్లిట్" గా పరిగణించబడి అనర్హత నుంచి రక్షణ ఉండేది. 2003లో 91వ రాజ్యాంగ సవరణ ఆ మినహాయింపును తొలగించింది. ఒక రాజకీయ పార్టీ మరొక రాజకీయ పార్టీలో విలీనమై, ఆ విలీనానికి శాసనసభాపక్షంలోని కనీసం మూడింట రెండొంతుల మంది అంగీకరించినప్పుడు మాత్రమే పదో షెడ్యూల్ కింద రక్షణ కొనసాగుతుంది.

పదో షెడ్యూల్ తర్వాత.. కొత్త దారులు..

పదో షెడ్యూల్ అమల్లోకి వచ్చాక, రాజకీయ పక్ష్యాలులు కొత్త మార్గాలు కనుగొన్నాయి. గుంపులుగా పార్టీలు మారడం, విలీనం నిబంధనను ఆశ్రయించడం, రాజీనామాల ద్వారా సభా బలాన్ని మార్చడం జరిగాయి. తెలంగాణలో 2019లో కాంగ్రెస్‌కు చెందిన 18 మంది ఎమ్మెల్యేలలో 12 మంది అప్పటి టీఆర్ఎస్ శాసనసభాపక్షంలో విలీనం కావాలని కోరగా, ఆ సంఖ్య మూడింట రెండొంతులు కావడంతో స్పీకర్ దాన్ని గుర్తించారు.. అప్పుడు కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఇప్పుడు పరిస్థితి తారుమారు కావడంతో బీఆర్ఎస్ నుంచి ఎన్నికైన కొందరు ఎమ్మెల్యేలు అధికారంలో ఉన్న కాంగ్రెస్ వైపు వెళ్లారు..

ఇతర రాష్ట్రాల్లోనూ అంతే..!

అరుణాచల్‌ప్రదేశ్‌లో 2016లో ముఖ్యమంత్రి పెమా ఖండూ నాయకత్వంలో 44 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో 43 మంది పీపుల్స్ పార్టీ ఆఫ్ అరుణాచల్‌లో (పీపీఏ) చేరారు.. అదే ఏడాది చివరికి ఖండూతో పాటు మరో 32 మంది పీపీఏ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరడంతో, తాజా శాసనసభ ఎన్నిక లేకుండానే రాష్ట్రంలో పూర్తిస్థాయి బీజేపీ ప్రభుత్వం ఏర్పడింది. కర్ణాటకలో 2019లో 17 మంది కాంగ్రెస్-జేడీఎస్ ఎమ్మెల్యేల తిరుగుబాటు, రాజీనామాలు హెచ్.డి. కుమారస్వామి ప్రభుత్వ పతనానికి, బీజేపీ తిరిగి అధికారంలోకి రావడానికి దోహద పడ్డాయి. సుప్రీంకోర్టు వారి అనర్హతను సమర్థించినప్పటికీ ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనుమతించింది. మధ్యప్రదేశ్‌లో 2020లో 22 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల రాజీనామాలతో కమల్‌నాథ్ ప్రభుత్వం కూలిపోయింది. ఆ ఎమ్మెల్యేలు తరువాత బీజేపీలో చేరారు..

అనర్హత అధికారం స్పీకర్‌కు ఉండడంతోనే..

అనర్హతపై తీర్పు చెప్పే అధికారం స్పీకర్ లేదా చైర్మన్‌కే ఉండటం అనేకసార్లు న్యాయ వివాదాలకు దారితీసింది. 2020లో కీశం మేఘచంద్రసింగ్ కేసులో సుప్రీంకోర్టు, ఈ అధికారాన్ని స్వతంత్ర శాశ్వత ట్రిబ్యునల్‌కు అప్పగించే అంశాన్ని పార్లమెంట్ పరిశీలించాలని సూచించింది. అదే తీర్పులో, అసాధారణ పరిస్థితులు లేకపోతే అనర్హత పిటిషన్లను సాధారణంగా మూడు నెలల్లో నిర్ణయించాలనే కాలపరిమితినీ ప్రస్తావించింది. 2025 జూలై 31న తెలంగాణ కేసుల్లో సుప్రీంకోర్టు మరింత స్పష్టంగా, స్పీకర్ లేదా చైర్మన్‌కే అనర్హత నిర్ణయాధికారాన్ని అప్పగించే ప్రస్తుత వ్యవస్థ ఫిరాయింపులను సమర్థంగా అరికడుతోందా? ప్రజాస్వామ్య పునాదులను కాపాడటానికి అది సరిపోతుందా? అన్నది పార్లమెంట్ పరిశీలించాలని పేర్కొంది. పెండింగ్ పిటిషన్లను మూడు నెలల్లో పరిష్కరించాలని కూడా ఆదేశించింది.

పార్లమెంట్‌లో చర్చ జరగాల్సిందే!

ఫిరాయింపులు ఎక్కువవుతున్న నేపథ్యంలో కేంద్రం స్వతంత్ర నిర్ణయ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, అనర్హత పిటిషన్ల పరిష్కారానికి స్పష్టమైన కాలపరిమితిని కూడా నిర్దేశించే అంశంపై పార్లమెంట్ చర్చించి తగిన నిర్ణయం తీసుకోవాలి. దీర్ఘదృష్టితో చూస్తే, ఇది ఏ ఒక్క రాజకీయ పక్షం ప్రయోజనానికీ సంబంధించిన విషయం కాదు.. ప్రజాస్వామ్య విశ్వసనీయతకు, ముఖ్యంగా ఓటరు తీర్పును గౌరవించే వ్యవస్థకు ఈ ఏర్పాటు అవసరం. ప్రజాప్రతినిధి రాజకీయ అభిప్రాయం మార్చుకునే స్వేచ్ఛను గౌరవిస్తూనే, ఓటరు ఒక పార్టీ అభ్యర్థికి ఇచ్చిన తీర్పు సభలో మరో పార్టీకి సులభంగా బదిలీ కాకుండా చూడాలి. దానం నాగేందర్ కేసులో హైకోర్టు తీర్పు ఫిరాయింపులను అరికట్టాలన్న రాజ్యాంగ లక్ష్యం ఇంకా పూర్తిగా నెరవేరాల్సి ఉందని మరోసారి గుర్తు చేసింది.

ఏలూరు జిల్లాలో 200 మొబైల్ ఫోన్ల రికవరీ

ఏలూరు ,జిల్లా వ్యాప్తంగా సెప్టెంబర్‌లో పోలీసులు 200 పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను రికవరీ చేశారు. వీటి విలువ సుమారు రూ.50 లక్షలు. ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 4,563 మొబైల్ ఫోన్లను రికవరీ చేయగా, వాటి విలువ సుమారు రూ.11.40 కోట్లు. రికవరీ చేసిన ఫోన్లను అధికారులు సంబంధిత

అంతా వీళ్ల వల్లే,!ఉక్రెయిన్,డెమోక్రాట్లే, కారణం

వాషింగ్టన్,అమెరికాలో పెరుగుతున్న ఇంధన ధరలు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కొత్త రాజకీయ తలనొప్పిగా మారుతున్నాయి. మధ్యంతర ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. పెట్రోల్ ధరల పెరుగుదలకు తన ప్రభుత్వ విధానాలు కారణమన్న విమర్శలను తిప్పికొట్టేందుకు ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. ఇరాన్‌తో యుద్ధం, హోర్ముజ్ జలసంధి సంక్షోభం కంటే రష్యా రిఫైనరీలపై ఉక్రెయిన్ దాడులు, డెమోక్రాట్ల పాలనలోని రాష్ట్రాల్లో రిఫైనరీల మూసివేతలే ఇంధన ధరల పెరుగుదలకు కారణమని ఆరోపించారు.ట్రంప్ తన 'ట్రూత్ సోషల్'లో చేసిన పోస్టులో.. హోర్ముజ్ సమస్య ఇప్పుడు ప్రధాన కారణం కాదని పేర్కొన్నారు. భారీ స్థాయిలో చమురు బయటకు వస్తోందని, అసలు సమస్య రిఫైనరీలేనని అన్నారు. రష్యా రిఫైనరీలను ఉక్రెయిన్ ధ్వంసం చేస్తోందని.. అమెరికాలోని కాలిఫోర్నియా వంటి డెమోక్రటిక్ పాలిత రాష్ట్రాల్లో రిఫైనరీలు మూతపడుతున్నాయని విమర్శించారు.

హోర్ముజ్ సరఫరా.. 97 శాతం పతనం

అయితే నిపుణుల గణాంకాలు మరో చిత్రాన్ని చూపుతున్నాయి. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి హోర్ముజ్ జలసంధి మీదుగా రోజువారీ చమురు ఎగుమతులు 97 శాతం వరకు పడిపోయినట్లు సమాచారం. ప్రపంచ చమురు సరఫరాపై ఇది తీవ్ర ప్రభావం చూపుతోంది. అమెరికాలో వినియోగదారులపై కూడా ఆ ప్రభావం కనిపిస్తోంది. అమెరికన్ ఆటోమొబైల్ అసోసియేషన్ గణాంకాల ప్రకారం.. ప్రస్తుతం ఒక గ్యాలన్ (3.79 లీటర్లు) పెట్రోల్ సగటు ధర 4.36 డాలర్లకు చేరింది. నెల క్రితం ఇది 4.14 డాలర్లు మాత్రమే. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ ఇరాన్‌పై దాడులు ప్రారంభించిన సమయంలో గ్యాలన్ ధర 2.98 డాలర్లుగా ఉంది.

'మధ్యప్రాచ్య సరఫరా ఇంకా సాధారణ స్థాయికి రాలేదు'

అమెరికా, రష్యా-ఉక్రెయిన్ ఘర్షణలు పరస్పరం ప్రభావం చూపుతూ చమురు ఉత్పత్తుల మార్కెట్లను మరింత అస్థిరం చేస్తున్నాయని సెంటర్ ఫర్ ఏ న్యూ అమెరికన్ సెక్యూరిటీ నిపుణురాలు రేచల్ జియెంబా తెలిపారు.మధ్యప్రాచ్యం నుంచి చమురు సరఫరా ఇంకా సాధారణ స్థితికి చేరుకోలేదని ఆమె పేర్కొన్నారు. రష్యా రిఫైనరీలపై దాడులు, రష్యా చమురును శుద్ధి చేసే సంస్థలపై మరిన్ని అమెరికా ఆంక్షలు విధించే అవకాశాలు పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తున్నప్పటికీ.. ప్రస్తుత సంక్షోభానికి ప్రధాన కారణం మధ్యప్రాచ్యం నుంచి అస్థిరంగా వస్తున్న చమురు సరఫరానేనని వివరించారు.

అత్యవసర నిల్వల నుంచి చమురు విడుదల

ఇంధన ధరల ఒత్తిడిని తగ్గించేందుకు జీ7 దేశాలు కూడా చర్యలకు దిగాయి. శుక్రవారం అత్యవసర నిల్వల నుంచి 10 కోట్ల బ్యారెళ్ల ముడి చమురు, డీజిల్‌ను విడుదల చేయాలని నిర్ణయించాయి. మరోవైపు అమెరికా వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు కూడా 1982 తర్వాత ఎన్నడూ లేనంత కనిష్ఠ స్థాయికి చేరుకున్నాయి.అమెరికా ఒత్తిడితో కొన్ని యూరోపియన్ దేశాలు తమ వ్యూహాత్మక ఇంధన నిల్వలను విడుదల చేసేందుకు ముందుకొచ్చాయని గ్యాస్‌బడ్డీ పెట్రోలియం విశ్లేషణ విభాగం అధిపతి పాట్రిక్ డిహాన్ తెలిపారు. దీనివల్ల చమురు, పెట్రోల్, డీజిల్ ఫ్యూచర్స్ ధరలు కొంత తగ్గినట్లు పేర్కొన్నారు.

రష్యా రిఫైనరీలపై ఉక్రెయిన్ దాడులు

ఇదిలా ఉండగా రష్యా ఇంధన మౌలిక వసతులపై ఉక్రెయిన్ దాడులు కూడా



అంతర్జాతీయ మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా డీజిల్ ధరలపై ఒత్తిడి పెరిగింది. రష్యా చమురు శుద్ధి సామర్థ్యంలో సగానికి పైగా దెబ్బతీసినట్లు ఉక్రెయిన్ రక్షణ మంత్రిత్వ శాఖ ఆదివారం ప్రకటించింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం 2022లో ప్రారంభమైనప్పటి నుంచి ఇలాంటి దాడులు కొనసాగుతున్నాయి.అంతర్జాతీయ ఇంధన సంస్థ (xజూూ) విశ్లేషణ ప్రకారం.. ఈ ఏడాది జూన్‌లో రష్యా రిఫైనరీల ఉత్పత్తి రెండు దశాబ్దాల్లోనే అత్యల్ప స్థాయికి పడిపోయింది. గత 18 నెలల్లో డీజిల్ ఉత్పత్తి కూడా 30 శాతం తగ్గింది.

కాలిఫోర్నియాపైనా ట్రంప్ విమర్శలు

అమెరికాలో రిఫైనరీల మూసివేతలపైనా ట్రంప్ దృష్టి సారించారు. ముఖ్యంగా డెమోక్రటిక్ పార్టీ పాలిత కాలిఫోర్నియాలో గత ఏడాది రెండు రిఫైనరీలు మూతపడ్డాయని ఆయన ఆరోపించారు. ఎస్‌అండ్‌పీ గ్లోబల్ విశ్లేషణ ప్రకారం.. ఆ రెండు రిఫైనరీల మూసివేతతో కాలిఫోర్నియా చమురు శుద్ధి సామర్థ్యం 17 శాతం తగ్గింది. దీంతో స్థానికంగా ఇంధన సరఫరాలో కొంత లోటు ఏర్పడింది.అమెరికా ఇంధన ధరల పెరుగుదలకు కేవలం దేశీయ రిఫైనరీల సమస్యను మాత్రమే కారణంగా చూపడం సరిపోదని నిపుణులు చెబుతున్నారు. మధ్యప్రాచ్య సరఫరాలో ఏర్పడిన భారీ అంతరాయం, చమురు ఉత్పత్తులను ప్రపంచ మార్కెట్లకు తరలించడంలో పెరిగిన ఇబ్బందులు కూడా కీలకంగా మారాయి.

ఎన్నికల ముందు ట్రంప్‌కు పెట్రోల్ పరీక్ష

ఇంధన ధరలపై ట్రంప్ చేస్తున్న రాజకీయ ఎదురుదాడికి మరో కారణం ఉంది. అమెరికా మధ్యంతర ఎన్నికలు దగ్గరపడుతున్నాయి. ఈ ఎన్నికలు వాషింగ్టన్‌లో అధికార సమీకరణాలను మార్చే అవకాశం ఉంది. పెరుగుతున్న ధరలకు అధ్యక్షుడి విధానాలే కారణమని ప్రజల్లో అభిప్రాయం బలపడితే.. అది రిపబ్లికన్లకు రాజకీయంగా ఇబ్బందికరంగా మారే అవకాశముంది.ఇటీవలి ఏపీ-నార్క్ సర్వేలో 65 శాతం మంది అమెరికన్లు పెరుగుతున్న ధరలకు ట్రంప్ విధానాలే కారణమని అభిప్రాయపడ్డారు. మరో 61 శాతం మంది.. ట్రంప్ తిరిగి అధికారంలోకి వచ్చినప్పటి కంటే ప్రస్తుతం అమెరికా ఆర్థిక పరిస్థితి మరింత దిగజారిందని చెప్పారు.దీంతో పెట్రోల్ ధరల మంట కేవలం ఆర్థిక సమస్యగానే కాకుండా.. మధ్యంతర ఎన్నికల వేళ ట్రంప్ రాజకీయ భవితవ్యాన్ని ప్రభావితం చేసే అంశంగా మారుతోంది. హోర్ముజ్ నుంచి రష్యా రిఫైనరీల దాకా చమురు సంక్షోభానికి కారణాలపై అమెరికాలో రాజకీయ దుమారం రేగుతోంది.

కొత్తగా పెన్షన్లకు 14 లక్షల దరఖాస్తులు

విజయవాడ,ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పెంపుతో పాటు కొత్త పింఛన్ల మంజూరు అంశం అధికార కూటమి ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారింది. ప్రభుత్వం కొత్త దరఖాస్తులను ఆహ్వానించడంతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 13.65 లక్షల కంటే ఎక్కువ అప్లికేషన్లు వచ్చి పడ్డాయి. నెలకు ప్రాథమిక పింఛను మొత్తాన్నే రూ. 4,000కు పెంచడంతో, ప్రభుత్వ ఖజానాపై ఇప్పటికే ప్రతినెలా రూ. 2,700 కోట్లకు పైగా భారం పడుతోంది. ఈ నేపథ్యంలో దాదాపు 14 లక్షలకు పైగా వచ్చిన కొత్త దరఖాస్తులన్నింటికీ ఆమోదం తెలిపి పింఛన్లు ఇవ్వడం అనేది నిధుల కొరతతో ఉన్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి ఏమాత్రం సాధ్యంకాని పని.మరోవైపు, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అనర్హులకు భారీగా పింఛన్లు ఇచ్చారనే విమర్శలు ఉన్నప్పటికీ, వాటిని తొలగిస్తే రాజకీయంగా తీవ్ర వ్యతిరేకత వస్తుందనే భయం ప్రభుత్వంలో కనిపిస్తోంది. లక్షలాది మంది పాత లబ్ధిదారుల పింఛన్లను ఒకేసారి రద్దు చేస్తే, లబ్ధిదారులు వీధిలోకి రావడం, ప్రతిపక్షాలు దానిని ప్రధాన రాజకీయ అస్త్రంగా మార్చుకోవడం ఖాయం. అందువల్ల పాత లబ్ధిదారుల విషయంలో కఠినంగా వ్యవహరించేందుకు ప్రభుత్వం వెనుకంజ వేస్తోంది. ఫలితంగా అనర్హుల పింఛన్లు కొనసాగుతుండటం క్షేత్రస్థాయిలో చర్చనీయాంశంగా మారింది.ఈ పరిస్థితి అధికార పార్టీ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తికి దారితీస్తోంది. గతంలో ప్రత్యర్థి పార్టీకి మద్దతుగా ఉన్నవారికి పింఛన్లు అందుతున్నాయి.. ఏళ్ల తరబడి పార్టీ కోసం కష్టపడిన మాకు, మా సానుభూతిపరులకు కొత్త పింఛన్లు రాకపోతే మేమేం చేయాలి? అని కూటమి కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. తమకు దక్కాల్సిన న్యాయం జరగకపోతే, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి సహకరించడం కష్టమని కిందిస్థాయి నాయకులు బహిరంగంగానే హెచ్చరిస్తున్నారు. ఈ పరిణామం శ్రేణులను ఏకం చేయడంలో స్థానిక ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లకు పెద్ద సమస్యగా పరిణమించింది. ఈ సంక్లిష్ట సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం ఆరంచెల తనిఖీ, డిజిటల్ ఫిల్టరేషన్ వ్యూహాన్ని అమలు చేస్తోంది. ఇప్పటికే క్షేత్రస్థాయి పరిశీలనలో దాదాపు 1.42 లక్షల దరఖాస్తులను ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల స్థాయిలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయనే కారణంతో పక్కన పెట్టారు. భూమి పరిమితి, విద్యుత్ వాడకం, ఆదాయ పన్ను, నాలుగు చక్రాల వాహనాలు వంటి సాంకేతిక ప్రామాణికాలను కఠినతరం చేసి.. అర్హత లేని వారి దరఖాస్తులను సాంకేతిక కారణాలతో తిరస్కరించడం ద్వారా రాజకీయ కక్ష సాధింపు కాదు, నిబంధనల ప్రకారమే జరిగింది అని చెప్పే ప్రయత్నం ప్రభుత్వం చేస్తోందిఅంతేకాకుండా, ఒకే విడతలో అందరికీ పింఛన్లు ఇవ్వడం సాధ్యం కాదు కాబట్టి, దశలవారీగా మంజూరు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. మొదటి విడతలో అత్యంత పేదలు, దివ్యాంగులు, తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్నవారికి ప్రాధాన్యత ఇచ్చి, మిగిలిన వారి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచడం ద్వారా తాత్కాలికంగా ఉపశమనం పొందాలని చూస్తోంది. అలాగే, పాత పింఛన్లలో తీవ్రమైన బోగస్, రీ-వెరిఫికేషన్‌లో తేలిన కొన్ని స్పష్టమైన అనర్హతల ఆధారంగా మాత్రమే తొలగింపులు చేపట్టి, ఆ ఖాళీలలో క్రమంగా కొత్త కార్యకర్తలు లేదా నిజమైన అర్హులను భర్తీ చేసే మార్గాన్ని అనుసరించే అవకాశం ఉంది. కొత్త పింఛన్ల అంశం ప్రభుత్వానికి ఒక వైపు ఆర్థిక భారాన్ని, మరోవైపు స్వపక్ష కార్యకర్తల ఆగ్రహాన్ని తెచ్చిపెట్టింది. సాంకేతిక కారణాలతో ఫిల్టర్ చేయడం వల్ల తాత్కాలికంగా సమర్థించుకున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఉన్న నిజమైన అర్హులు, పార్టీ కార్యకర్తలను సంతృప్తి పరచడం కూటమి నాయకత్వానికి పెద్ద పరిక్షే. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ 'పింఛన్ల చిక్కుముడి'ని ప్రభుత్వం ఎలా విప్పుతుందనేది ఆసక్తికరంగా మారింది.

47 వ డివిజన్ లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కరీంనగర్ , నగర అభివృద్ధి... సంక్షేమానికి మా పాలకవర్గం పెద్దపీట వేస్తోందని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధిల

బస్సులో పరిచయం.. ప్రేమ పేరుతో మోసం రూ.20 లక్షల వరకు నగదు,

తాడేపల్లి,చంద్రగిరి మండలం కొంగరవారిపల్లెకు చెందిన ఎం. బేబీ శాలిని తనకు ఎదురైన సమస్యను రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి తనకు జరిగిన పరిణామాలను వివరించి, న్యాయం చేయాలని కోరారు.బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. తాను చంద్రగిరి నుంచి తిరుపతికి ప్రతిరోజూ బస్సులో ప్రయాణించే క్రమంలో ఆర్టీసీ కండక్టర్ వి. సుబ్రహ్మణ్యంతో పరిచయం ఏర్పడిందని తెలిపారు. ఆ పరిచయాన్ని క్రమంగా పెంచుకున్న సుబ్రహ్మణ్యం తనను ప్రేమిస్తున్నానని నమ్మించి, తనను మోసం చేశాడని ఆరోపించారు. ప్రేమ పేరుతో తనపై నమ్మకం కలిగించిన అనంతరం వివిధ దశల్లో తన నుంచి సుమారు రూ. 20 లక్షల వరకు నగదును తీసుకున్నాడని ఆరోపించారు. ఫోన్‌పే ద్వారా పలుమార్లు నగదు బదిలీ చేయించుకున్నాడని, తనతో బంగారం కూడా కొనిపించుకున్నాడని తెలిపారు. తన వద్ద నుంచి తీసుకున్న నగదు, బంగారం తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేశాడని వాపోయారు.అదేవిధంగా, తనను ప్రేమిస్తున్నానని చెబుతూ తన వెంటపడి, తనపై లైంగిక దాడికి పాల్పడ్డాడని బాధితురాలు ఆరోపించారు. ఈ పరిణామాలతో తాను తీవ్ర మానసిక వేదనకు గురయ్యానని, తనకు న్యాయం చేయాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని కోరారు.తన వద్ద ఉన్న ఫోన్‌పే లావాదేవీల వివరాలు, ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, బంగారం కొనుగోలుకు సంబంధించిన బిల్లులు, ఇతర ఆధారాలను కూడా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

తిరుపతి ఆర్ఎంకు మంత్రి వీడియో కాల్

బాధితురాలు తన సమస్యను వివరించిన వెంటనే మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తిరుపతి ఆర్టీసీ ఆర్ఎం (రీజినల్ మేనేజర్)కు వీడియో కాల్ చేసి సమస్యను వివరించారు. బాధితురాలు చేసిన ఆరోపణలపై సమగ్రంగా విచారణ జరిపించాలని, సంబంధిత కండక్టర్‌పై కఠినమైన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.ప్రజలకు సేవ చేయాల్సిన ఆర్టీసీ సిబ్బంది తమ విధుల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రయాణికులతో ముఖ్యంగా మహిళలతో మర్యాదగా, బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని మంత్రి స్పష్టం చేశారు.ఇలాంటి ఆరోపణలు ఎదురైనప్పుడు విషయాన్ని తేలికగా తీసుకోకుండా నిజానిజాలను పూర్తిస్థాయిలో విచారించి, తప్పు చేసినట్లు తేలితే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్ఎంను మంత్రి ఆదేశించారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆర్టీసీ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని, సిబ్బంది ప్రవర్తనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.బాధితురాలికి చట్టపరంగా న్యాయం జరిగేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశించారు. మహిళల భద్రత, గౌరవానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, బాధితులకు అండగా ఉంటామని మంత్రి స్పష్టం చేశారు.

మందుబాబుల్లో తెలంగాణ టాప్...

హైదరాబాద్,మద్యం వినియోగంలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. రాష్ట్రంలో 15 ఏళ్లు పైబడిన పురుషుల్లో ఏకంగా 43.9 శాతం మంది మద్యం సేవిస్తున్నట్లు ఔఈఊ-6 సర్వే గణాంకాలు వెల్లడించాయి. దేశవ్యాప్తంగా ఇదే వయసు పురుషుల్లో మద్యం వినియోగం సగటు 18.9 శాతంగా ఉండగా.. తెలంగాణలో నమోదైన శాతం దానికి రెండింతలకు పైగా ఉండటం గమనార్హం. ఈ గణాంకాలు రాష్ట్రంలో మద్యం వినియోగం ఏ స్థాయిలో ఉందో స్పష్టం చేస్తున్నాయి.ఔఈఊ-6 గణాంకాల ప్రకారం.. మద్యం వినియోగంలో తెలంగాణ తర్వాత రాజస్థాన్ రెండో స్థానంలో ఉంది. ఆ రాష్ట్రంలో 15 ఏళ్లు పైబడిన పురుషుల్లో 42.2 శాతం మంది మద్యం సేవిస్తున్నట్లు నమోదైంది. 38.3 శాతంతో ఛత్తీస్‌గఢ్ మూడో స్థానంలో ఉండగా.. 33.6 శాతంతో జార్ఖండ్ నాలుగో స్థానంలో, 26.9 శాతంతో మధ్యప్రదేశ్ ఐదో స్థానంలో నిలిచాయి. ఈ రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో మద్యం వినియోగం గణనీయంగా ఎక్కువగా ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.తెలంగాణలో పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో మద్యం వినియోగం అధికంగా ఉండటం మరో కీలక అంశంగా మారింది. పట్టణ ప్రాంతాల్లో 15 ఏళ్లు పైబడిన పురుషుల్లో మద్యం వినియోగం 36.3 శాతంగా ఉండగా.. గ్రామీణ ప్రాంతాల్లో ఇది 46.6 శాతంగా నమోదైంది. అంటే నగరాల కంటే గ్రామీణ ప్రాంతాల్లో మద్యం సేవించే వారి శాతం దాదాపు 10 శాతం పాయింట్లు ఎక్కువగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో మద్యం వినియోగాన్ని తగ్గించేందుకు అవగాహన కార్యక్రమాలు, ప్రజారోగ్య చర్యలు మరింత అవసరమనే చర్చకు ఈ గణాంకాలు దారితీస్తున్నాయి.మద్యం వినియోగం పురుషులకు మాత్రమే పరిమితం కావడం లేదని ఔఈఊ-6 గణాంకాలు సూచిస్తున్నాయి. మహిళల్లోనూ మద్యం సేవించే వారి శాతం నమోదైంది. తెలంగాణలో మహిళల మద్యం వినియోగం 7.1 శాతంగా ఉండగా.. ఈ విభాగంలో రాజస్థాన్ 19.9 శాతంతో మొదటి స్థానంలో ఉంది. తెలంగాణ 7.1 శాతంతో రెండో స్థానంలో నిలిచింది. ఛత్తీస్‌గఢ్‌లో 5.7 శాతం, జార్ఖండ్‌లో 5.5 శాతం, మధ్యప్రదేశ్‌లో 1.6 శాతం మహిళలు మద్యం సేవిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.మొత్తంగా చూస్తే తెలంగాణలో పురుషుల్లో మద్యం వినియోగం జాతీయ సగటుతో పోలిస్తే చాలా అధికంగా ఉండటం, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వినియోగం మరింత ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగించే అంశంగా మారింది. మహిళల్లోనూ వినియోగం పెరుగుతున్నట్లు కనిపించడం మరో ముఖ్య పరిణామం. మద్యం అధికంగా తీసుకోవడం కుటుంబ ఆర్థిక పరిస్థితులు, ఆరోగ్యం, సామాజిక జీవనంపై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో.. ఈ గణాంకాల నేపథ్యంలో మద్యం వినియోగ నియంత్రణ, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

శ్రీశైలంలో ఘనంగా నిర్వహించనున్న శరన్నవరాత్రి ఉత్సవాలు

శ్రీశైలం.శ్రీశైలంలోని శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల దేవస్థానంలో అక్టోబర్ 11 నుంచి 20వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్న శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలకు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్, ఈవో వేద పండితులు తో కలిసి ఆహ్వానం అందించారు.తాడేపల్లిలోని మంత్రి నివాసంలో శ్రీశైలం దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావుతో పాటు ఆలయ అర్చకులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. వేద మంత్రోచ్ఛారణల నడుమ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి వేద ఆశీర్వచనం అందజేసి, శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు.

వైభవంగా శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు

అక్టోబర్ 11 నుంచి 20వ తేదీ వరకు పది రోజుల పాటు శ్రీశైల క్షేత్రంలో శరన్నవరాత్రి మహోత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది.ఉత్సవాల్లో భాగంగా స్వామివార్లకు, అమ్మవార్లకు విశేష అభిషేకాలు, అర్చనలు, రుద్రయాగం, చండీయాగం, జప?పారాయణాలు, అమ్మవారి ఉత్సవమూర్తికి నవదుర్గ అలంకరణ, స్వామి అమ్మవార్లకు వివిధ వాహన సేవలు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నారు.

గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవులు ఎవరికి? కాంగ్రెస్‌లో ఆశావహుల పోటీ



హైదరాబాద్,తెలంగాణలో ఎమ్మెల్సీ పదవుల భర్తీ మరోసారి రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. మొత్తం ఐదు స్థానాలు ఖాళీ కానున్న నేపథ్యంలో, ఆయా స్థానాలను ఎవరికి కేటాయించాలన్న అంశంపై అధికార కాంగ్రెస్‌లో చర్చ మొదలైంది. ఐదు స్థానాల్లో రెండు స్థానాలకు ఎన్నికల ప్రక్రియ ఉండగా.. మరో మూడు స్థానాలు గవర్నర్ కోటాలో నామినేట్ పద్ధతిలో భర్తీ కానున్నాయి. దీంతో పార్టీ కోసం పనిచేసిన నేతలతో పాటు వివిధ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించే అంశం కూడా కీలకంగా మారనుంది. ఎమ్మెల్సీ పదవుల కోసం కాంగ్రెస్ పార్టీలో పలువురు నేతలు ఆసక్తి చూపుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ సందర్భాల్లో పదవులు ఆశించిన నేతలకు ఇప్పటివరకు అవకాశం దక్కని పరిస్థితిలో.. తాజా ఖాళీలు ఆశావహుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి.ముఖ్యంగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పనిచేసిన నేతలు, ఎన్నికల సమయంలో పార్టీ కోసం వ్యయ, ప్రయాసలు ఓర్చి పనిచేసిన నాయకులు తమకు అవకాశం కల్పించాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల ద్వారా భర్తీ అయ్యే రెండు ఎమ్మెల్సీ స్థానాల విషయంలో పార్టీ వ్యూహం భిన్నంగా ఉండే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. ప్రత్యక్ష ఎన్నికల ప్రక్రియలో పోటీ–చేసి రాజకీయంగా తమ సత్తా చాటగలిగే నాయకులకు ఈ స్థానాల్లో అవకాశం కల్పించే అంశాన్ని కాంగ్రెస్ నాయకత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం. అయితే, ఈ స్థానాల కోసం పోటీ– పడుతున్న ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో, పార్టీ అధిష్ఠానం ఎలాంటి సమీకరణాలను పరిగణనలోకి తీసుకుంటు–ందన్నది ఆసక్తికరంగా మారింది.గవర్నర్ కోటాలో భర్తీ కానున్న మూడు స్థానాల విషయంలో సామాజిక, ప్రాంతీయ సమీకరణాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్న ఆలోచన ఉన్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమంతో అనుబంధం ఉన్నవారు, ఉద్యమ కాలం నుంచి ప్రజా జీవితంలో కొనసాగుతున్నవారికి ప్రాతినిధ్యం కల్పించే అంశం పరిశీలనలో ఉన్నట్లు, ఆ సామాజిక సమీకరణాలతోనే అభ్యర్థుల ఎంపికపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో వివిధ స్థాయిల్లో పనిచేసిన పలువురు నేతలు.. రాష్ట్ర ఏర్పాటు తర్వాత కూడా తమకు తగిన రాజకీయ గుర్తింపు దక్కలేదన్న అభిప్రాయంతో అనేక మంది ఉన్నారు. ఈ నేపథ్యంలో గవర్నర్ కోటా పదవులను అలాంటి వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించే విధంగా ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్న ఆలోచనతో కాంగ్రెస్ పార్టీ కసరత్తు చేస్తోంది.

రేవంత్ సామాజిక వ్యూహానికి ఎమ్మెల్సీ ఎంపికలు మరో పరీక్ష?

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే సామాజిక సమీకరణాలకు ప్రాధాన్యం ఇస్తున్నారన్న చర్చ కాంగ్రెస్ వర్గాల్లో ఉంది. ముఖ్యంగా వెనుకబడిన వర్గాలు, మహిళలు, వివిధ సామాజిక వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే దిశగా ప్రభుత్వం, పార్టీ నిర్ణయాలు తీసుకుంటున్న నేపథ్యంలో.. ఎమ్మెల్సీ పదవుల భర్తీ కూడా అదే వ్యూహంలో భాగంగా ఉండొచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఐదు స్థానాలకు అనేక మంది ఆశావహులు ఉండటంతో, అందరినీ సంతృప్తిపరచడం పార్టీ నాయకత్వానికి సవాలుగా మారనుంది. పదవులు దక్కని నేతలకు భవిష్యత్తులో ఇతర అవకాశాలు కల్పిస్తామన్న భరోసా ఇవ్వాల్సిన అవసరం కూడా ఉండనుంది. ఎమ్మెల్సీ పదవుల భర్తీలో సీఎం రేవంత్ అభిప్రాయంతో పాటు కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయం కూడా కీలకం కానుంది.ఎన్నికల ద్వారా భర్తీ అయ్యే స్థానాల్లో రాజకీయంగా చురుకైన నేతలకు అవకాశం ఇవ్వడం, గవర్నర్ కోటాలో సామాజిక ఉద్యమ నేపథ్యాలను పరిగణనలోకి తీసుకోవడం వంటి అంశాలపై తుది నిర్ణయం వెలువడాల్సి ఉంది. మొత్తంగా.. ఐదు ఎమ్మెల్సీ స్థానాలు కాంగ్రెస్‌లో రాజకీయ సమీకరణాలకు మరో పరీక్షగా మారాయి. సమాజిక సమీకరణాల్లో ఎవరి వాటా ఎంత? ఎవరికి ఎన్నికల బరిలో అవకాశం దక్కుతుంది? ఎవరికి గవర్నర్ కోటా ద్వారా పదవి వరిస్తుంది? అన్న ప్రశ్నలకు పార్టీ అధినాయకత్వం తీసుకునే నిర్ణయంతో త్వరలోనే తెరపడనుంది.

బీసీలు, ఉద్యమకారులు, మహిళల్లో సానుకూలత లక్ష్యంగా..

వచ్చే నెలలో (నవంబర్‌లో) ఖాళీ కానున్న మూడు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల భర్తీపై అధికార కాంగ్రెస్‌లో కసరత్తు ఊపందుకుంది. ఇప్పటికే పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన నాయకుడికి ఎమ్మెల్సీ అవకాశం కల్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిరిసిల్ల సభలో ప్రకటించగా.. తాజాగా తెలంగాణ ఉద్యమ నేత కొండా లక్ష్మణ్ బాపూజీ కుమార్తె డాక్టర్ పవిత్రవాణి పేరు పరిశీలనలోకి వచ్చినట్లు సమాచారం. ఈ విషయంపై కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతున్నట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి. పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన నాయకుడిని ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో ఆ నిర్ణయానికి కాంగ్రెస్ అధిష్ఠానం ఆమోదం అవసరమని కూడా ఆయన స్పష్టం చేసినట్లు– తాజా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో పవిత్రవాణి పేరు తెరపైకి రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆయన పద్మశాలి సామాజిక వర్గానికి చెందినవారు కావడంతో.. ఉద్యమ నేపథ్యం, సామాజిక సమీకరణం రెండింటినీ కలిపే అవకాశం పవిత్రవాణి ఎంపిక ద్వారా లభిస్తుందనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన నాయకులు, వారి కుటుంబాలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలనే అంశాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గతంలోనూ ప్రస్తావించింది. ప్రొఫెసర్ ఎం.కోదండరామ్‌ను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమించడం కూడా ఈ నేపథ్యంలో ప్రస్తావనకు వస్తోంది. 2026 ఏప్రిల్‌లో గవర్నర్ ఆయనతో పాటు– మహ్మద్ అజారుద్దీన్ నియామకాలకు ఆమోదం తెలిపారు. ఇదే క్రమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ కుటు–ంబానికి ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా తెలంగాణ ఉద్యమ వారసత్వాన్ని రాజకీయంగా ప్రదర్శించవచ్చనే అభిప్రాయం పార్టీ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది.

మూడు సీట్లు.. విస్తృత సామాజిక సమీకరణాలు

నవంబర్‌లో గవర్నర్ కోటాలోని మూడు ఎమ్మెల్సీ పదవులు ఖాళీ కానున్నాయి. గోటరేటి వెంకన్న, బొగ్గారపు దయానంద్, బస్వరాజు సారయ్య పదవీకాలం నవంబర్ 14తో ముగియనున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ మూడు స్థానాల భర్తీలో సామాజిక సమీకరణాలకు ప్రాధాన్యం ఇవ్వాలనే చర్చ కాంగ్రెస్‌లో జరుగుతున్నట్లు పలు వార్తా కథనాలు పేర్కొంటున్నాయి. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మూడు స్థానాల్లో రెండింటిని బీసీలకు కేటాయించే అంశాన్ని ప్రకటించినట్లు కూడా వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో పవిత్రవాణి పేరు ఖరారైతే.. అది కేవలం ఒక పద్మశాలి నాయకురాలికి అవకాశం కల్పించడంగానే కాకుండా తెలంగాణ ఉద్యమ వారసత్వం, బీసీ సామాజిక సమీకరణాలు, మహిళా ప్రాతినిధ్యాన్ని ఒకే నిర్ణయంలో ప్రతిబింబించే ప్రయత్నంగా రాజకీయ వర్గాలు విశ్లేషించే అవకాశం ఉంది.తెలంగాణ ఉద్యమకారులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం తగిన ప్రాధాన్యం ఇవ్వలేదనే విమర్శను రేవంత్‌రెడ్డి తరచుగా రాజకీయంగా ప్రస్తావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉద్యమ నేత కొండా లక్ష్మణ్ బాపూజీ కుటుంబానికి ఎమ్మెల్సీ పదవి ఇవ్వడం ద్వారా కాంగ్రెస్ తనను తాను ఉద్యమ వారసత్వానికి దగ్గరగా చూపించుకునే అవకాశం ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు, అయితే, పవిత్రవాణి పేరుపై అధికారిక నిర్ణయం వెలువడే వరకు దీనిని ప్రతిపాదన లేదా పరిశీలనగానే చూడాల్సి ఉంటు–ంది. మూడు స్థానాలకు సంబంధించి కాంగ్రెస్ అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకున్న తర్వాతే పూర్తి స్పష్టత రానుంది. తాజా నివేదికల ప్రకారం పవిత్రవాణి పేరు మాత్రం ఈ దశలో ప్రధానంగా చర్చలోకి వచ్చింది.

ఎకో టూరిజం విస్తరణకు ఏపీ సర్కార్ కొత్త అడుగులు



మంగళగిరి, ప్రజలను ప్రకృతికి చేరువ చేయడంతోపాటు.. గిరిజన యువతకు ఎకో టూరిజం ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. నల్లమల నుంచి మారేడుమిల్లి వరకు, బాపట్ల తీర ప్రాంతం నుంచి కోటప్పకొండ వరకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నగరవన యోజనలో భాగంగా రాష్ట్రంలో కొత్తగా అభివృద్ధి చేసిన ఆరు నగరవనాలను మంగళవారం ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. నగరవన యోజన కింద ఇప్పటివరకు రాష్ట్రంలో 19 నగరవనాలు ఉండగా, తాజాగా ప్రారంభించిన ఆరు వనాలతో కలిపి మొత్తం 25 నగరవనాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. 305 హెక్టార్ల విస్తీర్ణంలో రూ.13 కోట్లతో వీటిని అభివృద్ధి చేసినట్లు చెప్పారు. నగరవనాలు కేవలం మొక్కలు పెంచే ప్రాంతాలుగా కాకుండా.. ప్రజలను ప్రకృతి ఒడికి చేర్చే ఆహ్లాదకర ప్రదేశాలుగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు.

ఆరోగ్యం.. ఆహ్లాదం.. ప్రకృతి అవగాహన

నగరవనాల్లో సైక్లింగ్, వాకింగ్ ట్రాక్‌లు, పిల్లలు ఆడుకునే ప్రదేశాలు, వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేస్తున్నట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రజలకు ఆరోగ్యంతోపాటు ప్రకృతిపై అవగాహన కల్పించేలా వీటిని అభివృద్ధి చేస్తున్నామన్నారు.బాపట్ల, చీరాల ప్రాంతాల్లోని నగరవనాలను తీర ప్రాంత పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. కోటప్పకొండకు ఆధ్యాత్మిక ప్రాధాన్యంతో పర్యాటక ఆకర్షణను పెంచుతున్నట్లు తెలిపారు. వినుకొండ, దేవరంపాడు, మాచర్ల ప్రాంతాల్లోనూ నగరవనాలను ఆకర్షణీయంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు.ప్రకృతికి దగ్గరైతే ఆరోగ్యం దగ్గరవుతుంది. ప్రకృతిని అర్థం చేసుకుంటే దాన్ని పరిరక్షించాలన్న బాధ్యత పెరుగుతుంది. ప్రకృతిని ప్రేమించి, భావితరాలకు దాన్ని బహుమతిగా అందించాలన్నదే మా సంకల్పం అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

ఎకో టూరిజంతో గిరిజనులకు ఉపాధి

రాష్ట్రంలో ఎకో టూరిజాన్ని విస్తరించడం ద్వారా గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. వెలిగోడు జంగిల్ సఫారీ ద్వారా సందర్శకులకు సరికొత్త అనుభూతిని అందించనున్నట్లు చెప్పారు. మారేడుమిల్లిలో ట్రెక్కింగ్, ఆరోమా కనోపీ వాక్ వంటి కార్యక్రమాలతో తూర్పు కనుమల ప్రకృతి అందాలను ప్రజలకు పరిచయం చేస్తామన్నారు.గిరిజనుల సంస్కృతి, జీవన విధానాన్ని పర్యాటకులకు పరిచయం చేయడంతోపాటు.. ఎకో టూరిజం అభివృద్ధి ద్వారా వారి జీవన ప్రమాణాల్లోనూ మార్పు తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. పర్యావరణ పరిరక్షణకు ప్రజల సహకారం అవసరమని పవన్ కల్యాణ్ కోరారు.

అటవీ శాఖ పుస్తకాలు ఆవిష్కరణ

అనంతరం అటవీ శాఖ రూపొందించిన 'వైల్డ్ ఆర్నమెంటల్ ప్లాంట్స్ ఆఫ్ ద నల్లమల ఫారెస్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్', 'బ్రీ ట్రాన్స్‌లోకేషన్ మాన్యువల్' పుస్తకాలను పవన్ కల్యాణ్ ఆవిష్కరించారు. దేశంలో తొలిసారిగా యూకలిప్టస్ పల్ప్ వుడ్ ప్లాంటేషన్ విభాగంలో సుస్థిర నిర్వహణ విధానాలను అమలు చేస్తున్నందుకు ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థకు లభించిన ప్రమాణ్ సర్టిఫికెట్‌ను అటవీ శాఖ అధికారులు ఆయన చేతుల మీదుగా స్వీకరించారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఏపీ గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ చైర్మన్ కొణిదల నాగబాబు, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష, చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య, అటవీ, పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, అటవీ దళాల అధిపతి డాక్టర్ చలపతిరావు, అదనపు పీసీసీఎఫ్ రాహుల్ పాండే, ఏపీ గ్రీన్ సీఈవో బీఎన్ఎన్ మూర్తి, అటవీ శాఖ సలహాదారు మల్లికార్జునరావు, ఎకో టూరిజం ఈడీ నందిని సలారియా తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ చోరీదారులకు పోలీసుల షాక్..!

భద్రాచలం ,భద్రాచలం పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ సందర్భాల్లో పోయిన మొబైల్ ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో పోలీసులు రికవరీ చేశారు. మొత్తం 32 మొబైల్ ఫోన్లను గుర్తించి, వాటిని సంబంధిత బాధితులు, యజమానులకు భద్రాచలం డీఎస్పీ యం. అరుణ్‌కుమార్ సమక్షంలో మంగళవారం అప్పగించారు.మొబైల్ ఫోన్లు పోయినట్లు బాధితుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు వాటి వివరాలను సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఫోన్ల ఆచూకీని గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. రికవరీ చేసిన ఫోన్లను బాధితులకు తిరిగి అందజేయడంతో వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా డీఎస్పీ యం. అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రజలు రద్దీ ప్రాంతాలు, మార్కెట్లు, బస్సులు, రైల్వే స్టేషన్లు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో మొబైల్ ఫోన్లు వినియోగించే సమయంలో

తెలంగాణలో అపార్ట్‌మెంట్లకు ఫైర్ ఎన్ఓసీ..

హైదరాబాద్,తెలంగాణలో కొత్తగా నిర్మించే నివాస అపార్ట్‌మెంట్‌లకు సంబంధించి రాష్ట్ర అగ్నిమాపక శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. భవన నిర్మాణానికి ముందు తీసుకోవాల్సిన ప్రొవిజనల్ ఫైర్ నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ కోసం అవసరమైన కనీస ఎత్తు పరిమితిని 18 మీటర్ల నుంచి 24 మీటర్లకు పెంచింది. ఈ సవరించిన నిబంధన అక్టోబర్ 7వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు.ఇప్పటివరకు ఉన్న నిబంధనల ప్రకారం, 18 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ ఎత్తు ఉన్న నివాస భవనాలు నిర్మాణ అనుమతికి ముందే తప్పనిసరిగా ఫైర్ ఎన్ఓసీ పొందాల్సి ఉండేది. తాజా మార్పుతో 18 నుంచి 24 మీటర్ల మధ్య ఎత్తు ఉండే అపార్ట్‌మెంట్‌లకు (సుమారు 5 నుంచి 7 అంతస్తులు) కేవలం ఎత్తు కారణంగా ప్రొవిజనల్ ఎన్ఓసీ తీసుకోవాల్సిన అవసరం ఉండదు. అయితే, ఈ సడలింపు కేవలం నివాస భవనాలకు మాత్రమే వర్తిస్తుంది. పాఠశాలలు, ఆసుపత్రులు, హోటళ్లు, హాస్టళ్లు, వాణిజ్య సముదాయాలు, కార్యాలయాలు, పరిశ్రమలు వంటి ఇతర భవనాలకు ప్రస్తుతం ఉన్న అగ్నిమాపక భద్రతా నిబంధనలే కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు.బిల్డర్ల సంఘాలతో జరిపిన సంప్రదింపులు, అలాగే ఇటీవల అమల్లోకి వచ్చిన నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ స్టాండర్డ్స్ 2026కు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, ఏప్రిల్ 30న నేషనల్ బిల్డింగ్ కోడ్ ఆఫ్ ఇండియా 2016 స్థానంలో 2026ను అమల్లోకి తెచ్చింది. ఈ నూతన జాతీయ ప్రమాణాల్లో నివాస భవనాల అగ్నిమాపక భద్రతకు 24 మీటర్ల ఎత్తును ఒక ముఖ్యమైన కొలమానంగా నిర్దేశించారు.తక్కువ, మధ్యస్థాయి నివాస భవనాలపై నియంత్రణ భారాన్ని తగ్గించి, అనుమతుల ప్రక్రియను సులభతరం చేయడమే ఈ మార్పు ముఖ్య ఉద్దేశమని తెలంగాణ ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్ వివరించారు.అయితే, ఎన్ఓసీ పరిధిలోకి రానంత మాత్రాన భవనాలకు ప్రాథమిక అగ్నిమాపక భద్రతా ప్రమాణాల నుంచి మినహాయింపు ఉండదని అధికారులు తేల్చి

వ్యూహాలు సరే...ఆచరణ సాధ్యమేనా



గుంటూరు, స్థానిక సంస్థల ఎన్నికలు ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అత్యంత ప్రాధాన్యత కలిగిన సవాలుగా మారాయి. 2024 సాధారణ ఎన్నికల ఓటమి తర్వాత పార్టీ క్యాడర్‌లో నెలకొన్న నైరాశ్యాన్ని తుడిచిపెట్టేందుకు అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి చావో రేవో తేల్చుకోవడానికే సిద్ధమయ్యారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జిల్లాల వారీగా రీజినల్ కోఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో సుదీర్ఘ సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ, స్థానిక ఎన్నికలను లైట్ తీసుకోవద్దని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. అధికార పక్షం నుంచి ఎలాంటి ఎదురుదెబ్బలు తగిలినా, ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. ప్రతీ స్థానంలో అభ్యర్థులను నిలబెట్టి పోటీని రసవత్తరంగా మార్చడమే జగన్ ప్రాథమిక వ్యూహంగా కనిపిస్తోంది. ఈసారి స్థానిక సమరంలో వైఎస్సార్‌సీపీ వ్యూహం మునుపటి కంటే చాలా భిన్నంగా ఉంది. ప్రతీ స్థానానికి సంబంధించి ప్రతిపాదించిన అభ్యర్థుల బలాబలాలను జగన్ స్వయంగా వడపోస్తున్నారు. అభ్యర్థి పార్టీకి ఎంత విధేయుడు? కేసులకు భయపడకుండా నిలబడగలడా? గెలిచాక పార్టీ మారకుండా ఉంటాడా? అనే అంశాల ఆధారంగానే బి-ఫామ్‌లు ఖరారు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ ఇన్‌ఛార్జ్‌లు సరిగా పనిచేయకపోతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరిస్తూ, అధిష్టానం వద్ద ఉన్న సమాచారంతో జిల్లాల నివేదికలను సరిపోల్చుకుంటున్నారు. ఓడినా గెలిచినా బరిలో నిలవడం ద్వారా మాత్రమే పార్టీ శ్రేణుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపవచ్చని జగన్ బలంగా నమ్ముతున్నారు.ఇదే సమయంలో, అధికార తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిలోని అంతర్గత విభేదాలను క్యాష్ చేసుకోవడానికి వైఎస్సార్‌సీపీ పావులు కదుపుతోంది. ముఖ్యంగా మున్సిపల్ కార్పొరేషన్లు, పురపాలక సంఘాల్లో మేయర్లు, మున్సిపల్ చైర్మన్ల స్థానాలకు నేరుగా ఎన్నికలు జరుగుతుండటంతో ఆశావహుల పోటీ కూటమిలో పీక్స్‌కు చేరింది. విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు వంటి ప్రధాన కార్పొరేషన్లలో మేయర్ సీటు కోసం టీడీపీలోని బలమైన వర్గాలు, జనసేన నేతల మధ్య టికెట్ల పోరు తీవ్రమవుతోంది. కూటమిలో కిందిస్థాయి నాయకుల మధ్య సమన్వయం కుదరడం అంత తేలిక కాదన్న విషయాన్ని గుర్తించిన వైఎస్సార్‌సీపీ, అక్కడ ముదిరే విభేదాలను తమకు అనుకూలంగా మలుచుకోవాలని భావిస్తోంది. ఈ మైండ్ గేమ్‌లో భాగముగానే వైఎస్సార్‌సీపీ తమ మేయర్, చైర్మన్ అభ్యర్థుల పేర్లను ముందే ప్రకటించకుండా గుంభనంగా వ్యవహరిస్తోంది. కూటమిలో టికెట్ దక్కని అసంతృప్త నేతలు, లేదా భాగస్వామ్య పక్షాల మధ్య కుదరని పొత్తుల వల్ల ఉత్పన్నమయ్యే పరిణామాలను గమనించిన తర్వాతే తమ అభ్యర్థులను ఖరారు చేయాలనేది జగన్ ఆలోచన. అంతేకాకుండా, ముందుగానే తమ అభ్యర్థుల పేర్లు బయటపెడితే అధికార యంత్రాంగం ద్వారా వారి ఆర్థిక మూలాలపై దెబ్బకొడతారనే వ్యూహాత్మక భయం కూడా వైఎస్సార్‌సీపీని ముందస్తు ప్రకటనలు చేయకుండా అడ్డుకుంటోంది. సోషల్ మీడియాలోనూ కూటమి వైఫల్యాలను, కిందిస్థాయి నేతల ఘర్షణలను హైలైట్ చేస్తూ వైఎస్సార్‌సీపీ డిజిటల్ వింగ్ విస్తృత ప్రచారం నిర్వహిస్తోంది. పోటీ నుంచి తప్పుకుంటే పార్టీ ఆసవాళ్లు కోల్పోతాం అన్న సంకేతాన్ని జగన్ బలంగా పంపడంతో, క్షేత్రస్థాయి నాయకులు కూడా ఈ ఎన్నికలను తమ ఉనికికి పరీక్షగా భావించి సర్వశక్తులు ఒడ్డుతున్నారు. కూటమి కట్టడిని దాటుకుని స్థానిక సంస్థల్లో సత్తా చాటడం వైఎస్సార్‌సీపీకి అంత సులువైన విషయం కాదు. అయినప్పటికీ, ప్రత్యక్ష ఎన్నికల్లో కూటమి నేతల విభేదాలను ఆసరాగా చేసుకుని లబ్ధి పొందాలనే జగన్ పక్కా లీగల్ ఢ పొలిటికల్ మైండ్ గేమ్ ఏ మేర ఫలిస్తుందో రాబోయే స్థానిక ఎన్నికల ఫలితాలే తేల్చనున్నాయి.

మైసూరు మించి దసరా ఉత్సవాలు..



విజయవాడ ,దసరా అంటే మైసూర్ పేరు గుర్తుకు రావడం అత్యంత సహజం. రాజవంశ సంప్రదాయం ప్రకారం మైసూర్ ప్యాలెస్ లో విద్యుత్ దీపాలను అందంగా అలంకరిస్తారు. జంబు సవారి నిర్వహిస్తారు. ఏనుగుల ఊరేగింపు జరుపుతారు. ఇలా దశాబ్దాలుగా మైసూర్ ప్రాంతంలో దసరా వేడుకలు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే ఇప్పుడు విజయవాడని కూడా దసరా టూరిజం డెస్టినేషన్ గా నిలబెట్టాలనే ప్రయత్నం జరుగుతోంది. తాజా పరిణామాలు దానిని సూచిస్తున్నాయి.అక్టోబర్ 11 నుంచి 20 వరకు విజయవాడ ఉత్సవ్ 2026 నిర్వహించబోతున్నారు. పున్నమి ఘాట్ కేంద్రంగా 10 రోజులపాటు ఉత్సవాలు నిర్వహించబోతున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు.. జానపద కళలు.. సంగీతం.. ఫుడ్ ఫెస్టివల్.. దాండియా.. మెగా కార్నివాల్.. ఎగ్జిబిషన్లు.. వినోద కార్యక్రమాలు నిర్వహించబోతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దసరా వేడుకల మీద ప్రముఖంగా దృష్టి సారించారు.వన్ సిటీ వన్ సెలబ్రేషన్ కాన్సెప్ట్ తో విజయవాడ నగరాన్ని సాంస్కృతిక టూరిజం బ్రాండ్ గా తీర్చిదిద్దడానికి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు.కనకదుర్గమ్మ దర్శనం.. విజయవాడ ఉత్సవ్.. నేషనల్ సరస్ మేళా.. ఇలా ఈ మూడింటిని కలిపి ఒకే టూరిజం ప్యాకేజీ లాగా మార్చి.. బయటి రాష్ట్రాల పర్యటకులను ఆకర్షించాలనేది లక్ష్యంగా కనిపిస్తోంది. పున్నమి ఘాట్ లో అక్టోబర్ 8 నుంచి 23 వరకు నేషనల్ సరస్ మేళా నిర్వహించబోతున్నారు.. మైసూర్ నుంచి ఏనుగులను విజయవాడకు తీసుకువచ్చే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. ఒక రకంగా ఇది మైసూరు దసరా వాతావరణాన్ని గుర్తుచేసే అంశం. ఇప్పుడంటే ఇప్పుడు కాకపోయినా.. విజయవాడ మైసూర్ ను అధిగమించే అవకాశం ఉంది. మైసూర్ ప్రాంతానికి 1610 సంవత్సరం నుంచి దసరా ఉత్సవాల చారిత్రక సంప్రదాయం ఉంది. అయితే విజయవాడకు కనకదుర్గమ్మ ఆలయం.. కృష్ణానది.. ఆధ్యాత్మికత.. తెలుగు సంస్కృతి అదనపు ఆకర్షణగా ఉంది.దసరా ఉత్సవాలను ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. ఈ వేడుకలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తమిళనాడు సీఎం విజయ్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, అస్సాం ముఖ్యమంత్రి హిమంత, ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి హాజరవుతున్నారు.. దసరా ఉత్సవాల ద్వారా విజయవాడ బ్రాండ్ మరింత పెంచడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. తద్వారా పర్యాటకపరంగా ఏపీ రాష్ట్రానికి సరికొత్త గుర్తింపు తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తోంది.టూరిజం ద్వారా ఆదాయం భారీగా వస్తూ ఉంటుంది. కేరళ నుంచి మొదలు పెడితే కర్ణాటక వరకు టూరిజం ద్వారా భారీగా ఆదాయాన్ని అక్కడ ప్రభుత్వాలు ఆర్జిస్తూ ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కూడా పర్యాటకరపరంగా అనేక అనుకూలతలు ఉన్నాయి. అందువల్లే కూటమి ప్రభుత్వం పర్యాటకపరంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సరికొత్త గుర్తింపు తీసుకురావడానికి.. మరింత ఉన్నత స్థాయిలో అభివృద్ధి చేయడానికి ప్రయత్నాలు చేస్తోంది. అందువల్లే దసరా ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ప్రణాళికలు రూపొందించింది. తద్వారా టూరిజం ఆదాయం తో పాటు ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని ప్రభుత్వం భావిస్తోంది.

డిపెండెంట్‌లకు ఆర్డర్లు అందజేయాలి



హైదరాబాద్, సింగరేణి బొగ్గు గని కార్మికులు, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న సుదీర్ఘకాల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కీలక నిర్ణయాలు తీసుకున్నారు.సింగరేణి ప్రాంత మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, గడ్డం వివేక్ వెంకట స్వామి, ఎమ్మెల్యేలు ప్రేమ్ సాగర్ రావు, డాక్టర్ మట్టా రాగమయి, కోరం కనకయ్య, మాలోతు రాందాస్ నాయక్, పాయం వెంకటేశ్వర్లు, కూనంనేని సాంబశివరావు, గంద్ర సత్యనారాయణ రావు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, గడ్డం వినోద్ వెంకటస్వామి, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ సంస్థ ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి ప్రజాభవన్‌లో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. సింగరేణి వ్యాప్తంగా కార్మికుల సమస్యలను, ప్రాంతీయ అభివృద్ధికి సంబంధించిన పలు విజ్ఞప్తులను ప్రజాప్రతినిధులు ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురాగా ఆయన వాటన్నింటినీ సానుకూలంగా విని తక్షణ చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. పెండింగ్‌లో ఉన్న సుమారు 250 నుండి 300 వరకు ఉన్న డిపెండెంట్ ఆర్డర్లను, ఇతర లీగల్ ప్రాసెస్‌లను రాబోయే 15 రోజుల్లో పూర్తి చేసి అభ్యర్థులకు అందజేయాలని ఆదేశించారు. డిపెండెంట్ ఉద్యోగుల పేర్ల మార్పులకు సంబంధించి సుమారు 136 మంది(గరిష్ఠంగా 170 మంది) సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, అధికారులు మానవీయ కోణంలో ఆలోచించి ఇందుకు ఏర్పాటు చేసిన సింగరేణి ఆఫీసర్స్ కమిటీ సిఫారసుల ఆధారంగా తగిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. మెడికల్ ఇన్వాలిడేషన్ కోసం కార్మికులు కొత్తగూడెం వరకు రావాల్సిన అవసరం లేకుండా సింగరేణి పరిధిలోని అన్ని ఏరియా హాస్పిటల్స్‌లో ప్రతి నెలా ఒక నిర్దిష్ట బోర్డు మీటింగ్ నిర్వహించాలన్నారు. అక్కడే వీలైనంతమందికి పరీక్షలు నిర్వహించి మెడికల్ ఇన్వాలిడేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కరోనా సమయంలో లేదా ఇతర స్థానిక కారణాల వల్ల విధులకు హాజరుకాక ఉద్యోగాల నుండి తొలగింపునకు గురైన కార్మికుల విషయంలో వన్ టైం ఆప్షన్ కింద తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించారు. విధులు నిర్వర్తించకుండా సమ్మెకు పిలుపునిచ్చిన లేదా సమ్మెలో పాల్గొన్న అధికారులపై, దానికి నాయకత్వం వహించిన వారిపై 'నాన్ మెయింటెనెన్స్ ఆఫ్ డ్యూటీస్' కింద ఒక చిన్న హెచ్చరిక జారీ చేయాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి కేటాయించిన భూముల్లో 5774 ఎకరాలు తిరిగి రెవెన్యూ శాఖకు సింగరేణి సంస్థ అప్పగించగా అందులో 4,500 ఎకరాల్లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేదలకు పట్టాలు పంపిణీ చేశారని, మిగతా 1250 ఎకరాల్లో జీవో 76 ప్రకారం అర్హులకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. సింగరేణి అధికారులు, జిల్లా కలెక్టర్‌తో కూడిన కమిటీ ఆక్రమణలో ఉన్న నివాసితుల ప్రాథమిక జాబితాను సిద్ధం చేసి స్థానిక శాసనసభ్యులతో సంప్రదింపులు జరిపి వారి అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకొని అర్హులైన లబ్ధిదారుల సమగ్ర జాబితాను తయారు చేసి ఈ ప్రక్రియ మొత్తాన్ని నెల రోజుల లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. సింగరేణి భూముల్లో మైనింగ్ చేయని ప్రదేశాలను గుర్తించి ఉద్యోగులు, కార్మికుల ఇండ్ల నిర్మాణం కోసం లేఅవుట్ చేసి నెహ్రూ హౌజింగ్ కాలనీ తీసుకురావడానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని కూడా భట్టి ఆదేశించారు. సింగరేణి సంస్థ ఏరియా హాస్పిటల్స్‌ను కార్పొరేట్ హాస్పిటల్స్‌గా తీర్చిదిద్దాలన్నారు. అవసరమైతే వైద్యులకు వేతనాలు, పరిహారం పెంచి నిపుణులైన డాక్టర్లను నియమించాలని, అత్యవసర వైద్యం కోసం కార్డియాక్, క్యాథ్‌లాబ్ సేవలను అందుబాటులోకి తేవాలని సూచించారు. బొగ్గు గనులు, ఓవర్ బర్డెన్ డంప్‌ల దుమ్ము వల్ల ప్రాంతీయ ప్రజలలో క్యాన్సర్ ముప్పు పెరుగుతోందని పలు అధ్యయనాలు తెలుపుతున్నందున సింగరేణి పరిధిలోని పాత జిల్లాల్లో ప్రతి గ్రామంలో ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. సింగరేణి పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లు, ప్రభుత్వ హాస్పిటల్స్, ప్రభుత్వ భవనాలపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసి సోలరైజ్ చేయాలని సూచించారు. ఖరీదైన వ్యాపార, పట్టణ భూములను కమర్షియల్ వినియోగానికి, ఊరి బయట ఉన్న ఉపయోగపడని భూములు, ఓవర్ బర్డెన్ గుట్టలను సోలార్ ప్లాంట్లకు ఉపయోగించాలని స్పష్టం

ట్రంప్ సంచలన వ్యాఖ్యలు...ఇరాన్ నెక్స్ట్ టార్గెట్ ఈ నగరాలే?



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ఓ వ్యాఖ్య ఇప్పుడు అమెరికా రాజకీయాల్లోనే కాకుండా అంతర్జాతీయంగా కూడా తీవ్ర చర్చకు దారితీసింది.ఇరాన్‌తో కొనసాగుతున్న యుద్ధం గురించి నెబ్రాస్కాలోని గ్రాండ్ ఐలాండ్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడిన ట్రంప్.. "వాళ్లు ఒక నగరాన్ని ధ్వంసం చేయగలరు.. లాస్ ఏంజెల్స్‌ను చేయనివ్వండి.. శాన్ డియాగోను చేయనివ్వండి" అనే అర్థం వచ్చేలా వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యల పూర్తి ఉద్దేశం ఏమిటన్నది మాత్రం స్పష్టంగా తెలియలేదు. అయితే సభలోని కొంతమంది నుంచి చప్పట్లు రావడం, ఆ తర్వాత కాలిఫోర్నియా నేతలు తీవ్రంగా స్పందించడంతో ఈ వ్యవహారం రాజకీయ దుమారంగా మారింది.

అసలు ట్రంప్ ఏం అన్నారు?

ఇరాన్ యుద్ధం కారణంగా అమెరికాలో పెరుగుతున్న ఇంధన ధరలు, ఆర్థిక ఒత్తిడి గురించి ట్రంప్ మాట్లాడుతున్నారు. ప్రపంచాన్ని, అమెరికాను సురక్షితంగా ఉంచేందుకు ఈ పరిస్థితి ఒక చిన్న మూల్యం చెల్లించాల్సిన అవసరమని ఆయన అన్నారు. ఆ తర్వాతే లాస్ ఏంజెల్స్, శాన్ డియాగో నగరాల పేర్లు ప్రస్తావించారు. "వాళ్లు ఒక నగరాన్ని ధ్వంసం చేయగలరు. లాస్ ఏంజెల్స్ లేదా.... శాన్ డియాగోను ధ్వంసం చేయగలరు" అనే వ్యాఖ్యలు చేశారు. అనంతరం యుద్ధం త్వరలోనే ముగుస్తుందని కూడా చెప్పారు. అయితే ఈ మాటలను ట్రంప్ నిజంగా ఇరాన్ దాడిని అంగీకరించే ఉద్దేశంతో అన్నారా, లేక ఇరాన్‌కు అలాంటి సామర్థ్యం వస్తే అమెరికాకు ఎదురయ్యే ప్రమాదాన్ని ఉదాహరణగా చెప్పారా అన్నదానిపై స్పష్టత లేదు. అమెరికా అధ్యక్షుడి వ్యాఖ్యలు ఇదే కారణంగా మరింత చర్చకు దారితీశాయి.

కాలిఫోర్నియా గవర్నర్ తీవ్ర స్పందన

ట్రంప్ వ్యాఖ్యలపై కాలిఫోర్నియా గవర్నర్ గావిన్ న్యూసమ్ తీవ్రంగా స్పందించారు. ట్రంప్ వ్యాఖ్యలను ఆయన "ప్రమాదకరమైనవి" అంటూ విమర్శించారు. రెండు ప్రధాన నగరాల్లో 10 మిలియన్లకు పైగా ప్రజలు నివసిస్తున్న విషయాన్ని ప్రస్తావిస్తూ.. వారి ప్రాణాలను ఏ పరిస్థితుల్లోనూ చిన్న మూల్యంగా చూడలేమని అన్నారు. లాస్ ఏంజెల్స్ మేయర్ కరెన్ బాస్ కూడా ట్రంప్ వ్యాఖ్యలను తప్పుబట్టారు. ఒక దేశ అధ్యక్షుడి బాధ్యత ప్రజలను రక్షించడం కానీ, అమెరికన్ పౌరులపై దాడులను ప్రోత్సహించేలా మాట్లాడటం కాదని ఆమె వ్యాఖ్యానించారు. శాన్ డియాగో మేయర్ టాడ్ గ్లోరియా స్పందిస్తూ.. తమ నగరం "కొలేటరల్ డ్యామేజ్" కాదని, తమ ప్రజలు త్యాగం చేయాల్సిన చిన్న మూల్యం కాదని స్పష్టం చేశారు. ట్రంప్ తన "నిర్లక్ష్యపూరిత యుద్ధ వ్యాఖ్యల" నుంచి శాన్ డియాగోను దూరంగా ఉంచాలని కోరారు.

ఎందుకు ఈ రెండు నగరాలే?

లాస్ ఏంజెల్స్, శాన్ డియాగో సాధారణ అమెరికన్ నగరాలు మాత్రమే కావు. అమెరికాలో జనాభా పరంగా లాస్ ఏంజెల్స్ రెండో అతిపెద్ద నగరం. శాన్ డియాగో ఎనిమిదో అతిపెద్ద నగరంగా ఉంది. శాన్ డియాగోకు సైనికంగా కూడా ఎంతో ప్రాధాన్యత ఉంది.

తెలంగాణ బీజేపీ త్రిముఖ వ్యూహం.. 3 జోన్లు.. 3 విభిన్న ప్లాన్లు!



హైదరాబాద్, తెలంగాణ బీజేపీని ఒకే లెక్కతో నడపడం కాకుండా.. రాష్ట్రాన్ని మూడు రాజకీయ జోన్లుగా చూసే వ్యూహానికి పార్టీ నాయకత్వం పదును పెడుతోంది. ఒక్కో ప్రాంతం.. ఒక్కో సమస్య.. అందుకు తగ్గట్టే ఒక్కో వ్యూహం. ZONE-1 వరంగల్ - నల్గొండ - ఖమ్మం, ZONE-2 హైదరాబాద్ - రంగారెడ్డి - మహబూబ్‌నగర్,ZONE-3 ఆదిలాబాద్ - కరీంనగర్ - నిజామాబాద్ - మెదక్ గా విభజించారు.

ZONE-1

ZONE-1లో లీడర్లు ఉన్నారు.. కేడర్ కావాలి. వరంగల్, నల్గొండ, ఖమ్మం ప్రాంతాల్లో పార్టీకి పలువురు రాజకీయ నాయకులు ఉన్నా.. వారికి అనుగుణంగా బలమైన కేడర్‌ను విస్తరించాల్సిన అవసరం ఉందన్నది బీజేపీ నాయకత్వం లెక్కగా కనిపిస్తోంది. అందుకే ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి. వరంగల్‌ను కేంద్రంగా చేసుకుని పనిచేసే బాధ్యత దశరథ్‌కు రావడం.. ఈ జోన్‌కు సంస్థాగత ప్రాధాన్యత పెరిగినట్టుగా పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. దశరథ్‌ను తెలంగాణ జాయింట్ జనరల్ సెక్రటరీగా నియమించి.. వరంగల్‌ను ఆయన కేంద్రంగా పార్టీ నిర్ణయించింది. దశరథ్‌కు సంస్థాగత బాధ్యతలు అప్పగించడం వెనుక.. ఈ ప్రాంతంలో నాయకులను సమన్వయం చేయడం.. కొత్త కేడర్‌ను తయారు చేయడం.. బూత్ స్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడం ప్రధాన లక్ష్యాలుగా పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దశరథ్.. బీజేపీ జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్‌కు సన్నిహితుడిగా పార్టీ వర్గాల్లో గుర్తింపు పొందారు. ఇప్పుడు వరంగల్ కేంద్రంగా బాధ్యతలు చేపట్టడంతో.. ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం ప్రాంతాల్లో సంస్థాగత వ్యవహారాలపై ఆయన ఫోకస్ పెరగనుంది. అయితే.. ఇక్కడ అసలు టార్గెట్ నాయకులు కాదు.. నాయకులతో పాటు కేడర్‌ను నిర్మించడం.

ZONE-2

ZONE-2లో కేడర్ ఉంది.. లీడర్ కావాలి. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో బీజేపీ లెక్క మరోలా ఉంది. ఇక్కడ పార్టీకి కేడర్ బేస్ ఉందని నాయకత్వం భావిస్తోంది. కానీ.. ఆ కేడర్‌ను నడిపించే బలమైన స్థానిక నాయకత్వాన్ని మరింతగా గుర్తించాల్సిన అవసరం ఉందన్నది పార్టీ వ్యూహం. ఇదే సమయంలో ఈ ప్రాంతాల్లో ూూ సంస్థాగతంగా బలంగా ఉండటంతో.. బీజేపీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి మధుకర్‌కు ఈ జోన్ కీలకంగా మారనుంది. మధుకర్‌ను ూూ, తెలంగాణ రాష్ట్రాలకు సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా నియమించి.. హైదరాబాద్‌ను ఆయన కేంద్రంగా పార్టీ కేటాయించింది. ఈ ప్రాంతంలో.. ఎవరికి ఏ బాధ్యత? ఎక్కడ ఎవరు బలంగా ఉన్నారు? కొత్త నాయకత్వాన్ని ఎక్కడ తయారు చేయాలి? అనే అంశాలపై దృష్టి పెట్టే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అంటే.. కేడర్‌ను ఓటు బ్యాంక్‌గా మార్చే ముందు.. కేడర్‌కు రాజకీయ నాయకత్వాన్ని తయారు చేయడమే లక్ష్యం. ఇదే ఈ జోన్‌లో బీజేపీ సంస్థాగత వ్యూహానికి కీలకమైన అంశంగా కనిపిస్తోంది.

ZONE-3

ZONE-3 అయిన ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ ప్రాంతాలపై బీజేపీ లెక్క మరోలా ఉంది. ఈ ప్రాంతాల్లో ఇప్పటికే పార్టీకి బలమైన నాయకులు.. వారితో పాటు కేడర్ బేస్ కూడా ఉందని బీజేపీ అంచనా వేస్తోంది. అందుకే ఇక్కడ కొత్తగా సంస్థాగత నిర్మాణం చేయడం కంటే.. ఇప్పటికే ఉన్న నాయకత్వాన్ని ఉపయోగించుకోవడమే ప్రధాన వ్యూహం. ఈ ప్రాంతాల్లో బీజేపీకి ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉండటంతో.. నాయకత్వం.. నియోజకవర్గం.. కేడర్.. బూత్ అనే మోడల్‌లో బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇక్కడ కొత్తగా లీడర్లను వెతకడం కంటే.. ఉన్న నాయకులనే సంస్థాగతంగా యాక్టివ్ చేయడం బీజేపీ ముందున్న మరో టాస్క్.

బీజేపీ త్రిముఖ వ్యూహం..

ఇదే తెలంగాణలో బీజేపీ త్రిముఖ సంస్థాగత వ్యూహంగా పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే వ్యూహం ప్రకటించడం ఒక ఎత్తయితే.. దాన్ని గ్రౌండ్‌లో అమలు చేయడం మరో ఎత్తు. ఇప్పటికే అక్టోబర్ 6న జరిగిన రాష్ట్ర కార్యవర్గ స్థాయి చర్చల్లో.. పదవులు తీసుకుని క్షేత్రస్థాయిలో పని చేయకపోవడంపై నాయకత్వం అసంతృప్తి వ్యక్తం చేసినట్టు రిపోర్టులు వచ్చాయి.

గవర్నర్ కోటలో సోషల్ ఇంజనీరింగ్



హైదరాబాద్,తెలంగాణ శాసనమండలిలో నవంబర్‌లో మూడు గవర్నర్ కోటా ఎమ్మెల్సీలు ఖాళీ అవుతున్నాయి. మూడు ఎమ్మెల్సీ స్థానాల కోసం పార్టీలో ఊహించని స్థాయిలో పోటీ నెలకొంది. ఇటీవలే ప్రకటించిన పట్టభద్రుల కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలు రెండింటినీ రెడ్డి సామాజికవర్గానికే కేటాయించడంపై సోషల్ మీడియా వేదికగా, పార్టీ శ్రేణుల్లో విమర్శలు వ్యక్తమయ్యాయి. అందుకే సామాజిక సమీకరణాలను దారిలోకి తెచ్చేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం గవర్నర్ కోటాలోని స్థానాలను పూర్తిగా బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు కేటాయించే వ్యూహంతో ముందుకు వెళ్తోంది. ఈ నామినేషన్లలో తెలంగాణ ఉద్యమకారులకు, త్యాగాలు చేసిన కుటుంబాలకు ప్రాధ్యానమివ్వాలనే నిర్ణయం బలంగా వినిపిస్తోంది. ముఖ్యంగా తెలంగాణ తొలితరం ఉద్యమ నేత, ఆత్మగౌరవ ప్రతీక అయిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ కుటుంబానికి గవర్నర్ కోటాలో ఓ ఎమ్మెల్సీ స్థానాన్ని కేటాయించే ఆలోచనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. పద్మశాలి సామాజికవర్గానికి చెందిన బాపూజీ కుటుంబానికి, వారి కుమార్తెకు ఈ అవకాశం కల్పించడం ద్వారా అటు ఉద్యమకారులను గౌరవించినట్లవుతుందని, ఇటు కీలకమైన బీసీ ఓటు బ్యాంకుకు స్పష్టమైన సంకేతం ఇచ్చినట్లవుతుందని కాంగ్రెస్ భావిస్తోంది.ఈ మూడు స్థానాల భర్తీతో పార్టీలోని అసంతృప్తిని చల్లార్చడమే కాకుండా, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పక్కా సామాజిక ప్రాతిపదికను సిద్ధం చేసుకోవాలని అధిష్టానం యోచిస్తోంది. పద్మశాలి, గౌడ, ముదిరాజ్ లేదా ఎస్సీ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం వహించే సీనియర్ నేతలు, కేడర్‌లో పట్టున్న ఉద్యమకారుల పేర్లను నివేదికల రూపంలో సేకరిస్తున్నారు. గ్రాడ్యుయేట్ స్థానాల్లో ఓపెన్ కేటగిరీకి ప్రాధాన్యత లభించడంతో, ఈ నోటిఫికేషన్‌లో అణగారిన వర్గాలకే పెద్దపీట వేయకపోతే సామాజిక న్యాయం నినాదానికి విఘాతం కలుగుతుందనే అభిప్రాయం పార్టీ అగ్రనేతల్లోనూ నెలకొంది. గవర్నర్ కోటా నామినేషన్ల చట్టబద్ధత, నియామకాల ప్రక్రియపై గతంలో కోర్టు కేసులు నడవడం, సుప్రీంకోర్టు పరిణామాలు కూడా ఈ నామినేషన్లపై ప్రభావం చూపే అవకాశం ఉందని తెలుస్తోంది. న్యాయపరమైన అంశాలను అధిగమించి, రాజ్యాంగ నిబంధనలకు కట్టుబడి కళలు, సామాజిక సేవ, సాహిత్యం లేదా ప్రజా సేవలో అనుభవం ఉన్న బీసీ, ఎస్సీ నేపథ్యమున్న నాయకుల పేర్లను గవర్నర్ ఆమోదానికి సిఫార్సు చేయాలని మంత్రివర్గం సన్నాహాలు చేస్తోంది.నవంబర్ ఎమ్మెల్సీ రగడ కాంగ్రెస్ పార్టీకి అటు ఉద్యమకారులను ఆదుకోవడానికి, ఇటు సామాజిక న్యాయాన్ని నిలబెట్టుకోవడానికి ఒక రాజకీయ అవకాశంగా మారింది. కొండా లక్ష్మణ్ బాపూజీ కుటుంబానికి దక్కే అవకాశంతో పాటు మిగిలిన రెండు స్థానాల్లో ఎవరికి చోటు లభిస్తుందనేది తెలంగాణ పొలిటికల్ వర్గాల్లో ఆసక్తికర చర్చగా మారింది. బీసీ, ఎస్సీల మేళవింపుతో కూడిన ఈ వ్యూహం ఫలిస్తే, రేవంత్ రెడ్డి మార్క్ సోషల్ ఇంజనీరింగ్‌కు క్షేత్రస్థాయిలో మంచి మైలేజ్ లభించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PR